# జ్ఞానఫలం



దంతులూరి పెద్దిరాజు

# జ్ఞానఫలం

దంతులూరి పెద్దిరాజు

శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు

# జ్ఞానఫలం

**దంతులూరి పెద్దిరాజు**

ప్రథమ ముద్రణ: ఏప్రిల్, 2018
కాపీలు: 1,000

వెల: **రు. 50/-**

ప్రచురణ:
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్
ఫోన్: 08814–224747

ప్రతులకు:
శ్రీమతి కలిదిండి విజయలక్ష్మి
ఫోన్: 98665 26113

ముద్రణ:
రత్న ప్రింటింగ్ వర్క్స్
విజయవాడ – 520 002
ఫోన్: 9030 663666

# తొలిపలుకు

**నా**న్నగారితో నా అనుబంధం మూడు దశాబ్దాలది. తొలిసారి భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ ప్రక్కన ఉన్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో నాన్నగారి ప్రవచనం విన్నాను. 'ప్రియమైన ఆత్మబంధువుల్లారా!' అనే సంబోధనతో ప్రారంభమైన ఆ ప్రసంగం నా హృదయాన్ని తాకింది.

ఉపన్యాసానంతరం వేదికపైకి వెళ్లి నాన్నగారి దర్శనం చేసుకునే అదృష్టం కలిగింది. ఆయన రెండు చేతులతో నా బుగ్గలను స్పృశించిన ఆ క్షణం ఈనాటికీ నాకు ఒక మధురస్మృతి.

లంకలకోడేరు గ్రామంలో జూనియర్ కళాశాలలో పనిచేసిన ఆ రోజుల నుండి ఈనాటి వరకూ ఎన్నోసార్లు నాన్నగారిని దర్శించుకున్నాను. నాన్నగారి నోటినుండి వెలువడే ఆణిముత్యాల్లాంటి మాటలను ఆనాటి నుండి వింటూనే ఉన్నాను. నాన్నగారితో అనుబంధం నాటి నుంచీ బలపడుతూనే ఉంది.

శ్రావ్యమైన గొంతుకతో మధురంగా చెప్పే ఆ ఉపన్యాసాలు మకరందం వలె తీయదనాన్నిచ్చినా, ఆయన మాటలలో అంతర్లీనంగా మిళితమైన భావాలను అర్థంచేసుకోవడానికి చాలాకాలమే పట్టింది. గత మూడు దశాబ్దాలలో నాన్నగారి మోములో శాంత స్వభావాన్నే కాంచినాను. ఏనాడూ కోపపు ఛాయలు మచ్చుకైననూ కానరాలేదు.

నవనీతం లాంటి ఆ హృదయం భక్తుల వేదనా సెగలకు కరిగి పోతుంది. తొణికిసలాడే ఆత్మీయత నిండిన వదనం ఆయన స్వంతం. ఆ మాటల్లో చల్లదనం, ఆ పిలుపులో ఆప్యాయత, ఆ చిరునవ్వులో స్వచ్ఛత, ఆ చూపుల్లో అనురాగం గత మూడు దశాబ్దాల నుంచి వీక్షిస్తూనే ఉన్నాను. అవి కొందరికి మాత్రమే పరిమితమైనవి కాదు. చెంతకు చేరిన వారందరికీ అందుతూనే ఉన్నాయి.

ఎన్నెన్నో దైవీగుణాలు తనలో నింపుకుని ఎదుటి వ్యక్తిలో లేని ప్రత్యేకత లను వారికి ఉన్నట్లుగా ఆపాదించి, సామాన్యులనైనా ప్రత్యేకంగా గౌరవించే మహోన్నత వ్యక్తిత్వం ఆయన స్వంతం.

ఆధ్యాత్మికపరమైన పుస్తకం వ్రాసేటంతటి జ్ఞానసంపద లేకున్నా, ఆచరణలో తప్పటడుగులు వేస్తున్నా, నాన్నగారిపట్ల ఉండే ఇష్టాన్ని వ్యక్తం చేయాలనే తపనతో నాన్నగారి ఆశీస్సులతో చేసిన చిరు ప్రయత్నమే ఈ చిన్న పుస్తకం.

భక్తుల మనోభావాల అక్షరరూపమే ఈ చిరు పుస్తకం. జ్ఞాని వైభవాన్ని వర్ణించడానికి నాకుండే అర్హత, అవగాహన ఏపాటిది? అది మౌనం ద్వారా వ్యక్తం అయ్యేదే. సాహిత్యపు పరిజ్ఞానానికి పరిమితులుంటాయి. కానీ జ్ఞాని వైభవం అపరిమితం, వర్ణనాతీతం కదా! వర్ణించే ప్రయత్నం చేసినందుకు క్షంతవ్యుడిని.

సమస్త జీవరాసులలో తల్లికి పిల్లల పట్ల జనించిన అనురాగం నిష్కల్మషమైనది. స్వచ్ఛమైనది. అపురూపమైనది. ఆ బంధాన్ని వ్యక్తీకరించే ప్రయత్నం చేసాను.

పురుష ప్రయత్నానికి గురువు అనుగ్రహం తోడైతే అది ఆత్మ సాక్షాత్కారానికి రాచబాటే కాగలదు. చుట్టూ ఆవరించిన మబ్బుతెరలు వీడిపోతే మిగిలేది సత్యమైన, నిత్యమైన సహజ స్థితి ఆత్మయే కదా! ఆ మబ్బుతెరలను తొలగించడంలో గురువే కదా సూత్రధారి! అటువంటి గురువు సాన్నిధ్యాన్ని, వైభవాన్నీ ఆస్వాదించడం సర్వదా శుభప్రదం.

విద్యాబుద్ధులు నేర్పించి, జీవనయాత్రలో తొలి అడుగులు వేయించిన మాతృశ్రీ సూర్యకాంతమ్మ గారికి శిరస్సు వంచి ముకుళిత హస్తాలతో హృదయపూర్వక నమస్కృతులు అర్పించుకుంటున్నాను. ఆధ్యాత్మిక బాటవైపు పూజ్య గురుదేవులు జిన్నూరు నాన్నగారి పాదముల చెంతకు చేయిపట్టి నడిపించిన సహధర్మచారిణి శ్రీమతి జానకికి, ఈ పుస్తక ప్రచురణలో సహకారం అందించిన 'రత్న ప్రింటింగ్ వర్క్స్' వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

భావవ్యక్తీకరణలో దోషాలు ఉన్నా, అక్షర దోషాలు దొర్లినా సహృదయంతో అర్థంచేసుకోవలసిందిగా మనవి.

**– దంతులూరి పెద్దిరాజు**

# నాన్నగారి సాన్నిధ్యమే అదృష్టం

*ఓం శ్రీ గురుభ్యోనమః*

**లో**కంలో సాక్షాత్తూ భగవంతుడు మహాత్ముల రూపంలోనే ప్రకటితమవుతూ ఉంటాడు. 'నేను ఉన్నాను' అనే విశ్వాసాన్ని భక్తజనులలో కలిగించడానికి, మనోధైర్యాన్ని పెంచడానికి. అట్టి భగవత్ప్రకటనకు ప్రత్యక్ష సాక్ష్యమే శ్రీశ్రీశ్రీ జిన్నూరు నాన్నగారు. వీరి సాన్నిధ్యము అతి దగ్గరగా దొరకడమే మన ప్రాంతవాసుల అదృష్టం. ఇట్టి మహాత్ముల ప్రకటనకు ప్రత్యక్ష ఆధారము అక్షరబద్ధమైన భక్తుల సాక్ష్య ప్రకటనయే. స్వయం అనుభూతి, అచంచల భక్తి విశ్వాసము, పరిపూర్ణ శరణాగతి ఉన్నవారు మాత్రమే అట్టి దివ్యదర్శనాన్ని పొందగలరు. అట్టి నిజస్థితి ఉన్న వ్యక్తియే ఈ గ్రంథ రచయిత శ్రీ పెద్దిరాజు. ఇట్టి నిజస్థితి ఎంతమందికి ఉన్నా స్వప్రేరణతో దానిని గ్రంథస్థము చేయగలగడం ఈ రచయితకు లభించిన గొప్ప అదృష్టము, ఒక మహదవకాశము. రచనా వ్యాసంగంలో ఈయనకిది తొలి ప్రయత్నమే అయినా భావ ప్రకటనలో ఎంతో స్పష్టత, స్వయం అనుభూతి మనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

ఈ పుస్తకాన్ని పరిశీలనార్థం నాకు పంపినపుడు దానిని నేను చదువుతూంటే పుస్తకంలోని అక్షరాల వెనుక సాక్షాత్తూ నాన్నగారి స్వరూపమే దర్శనమయింది. ఈ పుస్తకాన్ని చదువుతున్నప్పుడు ఆయనకు ఎంతో దగ్గరగా ఉన్నట్టు, ఎంతో ఆత్మీయతతో, ప్రేమతో మనకు ఆయన దివ్యత్వాన్ని అందిస్తున్నట్లు అనిపించిందంటే అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు. ఆయన ఏ లోకాలకూ వెళ్లలేదనేది సత్యం. కేవలం భక్తుల హృదయ లోకాలలోనే ఆయన శాశ్వత ఆవాసం అనేది మరింత స్పష్టం.

మనలో చాలామంది అనేకసార్లు జిన్నూరు వెళ్లి వచ్చి ఉంటారు. అయితే ఈ పుస్తకం చదివిన తరువాత జిన్నూరు వెళ్తే కలిగే అనుభూతి అలౌకికముగా ఉంటుందనేది నిస్సందేహము. అసలు వాస్తవానికి ఈ పుస్తకాన్ని పెద్దిరాజుగారు స్వయంగా వ్రాసారని నేను అనుకోవడం లేదు.

నాన్నగారే ఈయన చేత వ్రాయించి ఉంటారని భావించడం సముచితంగా ఉంటుంది.

ఈ పుస్తకాన్ని చదివే ముందు ఓ పది నిమిషాలు నాన్నగారిని ధ్యానించుకుని చదివినట్లయితే రచయిత యొక్క నిజ అనుభూతి మనకు స్పష్టమవుతుంది. నాన్నగారి యొక్క దివ్యదర్శనాన్ని అక్షరబద్ధం చేసే అవకాశం దొరకడం భగవంతుని ఆశీస్సులు సదా పెద్దిరాజుగారికి, వారి కుటుంబానికి ఉన్నాయనడానికి ప్రత్యక్ష సాక్ష్యం.

*గురు పాదుకల ముందు మోకరిల్లి నమస్కరిస్తూ...*

ఇట్లు,
**వశిష్ఠాశ్రమ వ్యవస్థాపకులు**
అంతర్వేది

# అనుదినం నాన్నగారితో...

ఓం శ్రీ నాన్న పరమాత్మనే నమః

**మా**టకి అందని మౌనం, ఊహకి అందని అనుగ్రహానికి ప్రతిరూపం మన 'నాన్నగారు'.

పెద్దిరాజుగారు వ్రాసిన ఈ జ్ఞానఫలం ఆయన పుణ్యఫలం. ఇది ఒక రచన కాదు. ఆయన తపస్సు.

ఏ పుస్తకం చదివినా ఆ పదాల వెనుక భావం వ్యక్తమౌతుంది. ఈ మహత్తర పుస్తకం చదవడం మొదలుపెట్టాక అర్థమయింది... ఇక్కడ ఉన్నవి పదాలు, భావమే కాదు... వర్ణనాతీతమయిన అమూల్యసందేశం అని. 'ఇంత అద్భుతంగా కూడా వ్రాయవచ్చునా?' అనిపించింది. త్యాగరాజు 'పాడి పొందలేదట... పొంది పాడాడట' అన్నట్లుగా ఈ పుస్తకంలోని ప్రతి అంశమూ రచయత స్వయం అనుభవపూర్వకంగా రాసినట్లుగా అర్థమవుతూనే ఉంది.

మాటకి, మనస్సుకి, ఇంద్రియాలకి, బుద్ధికి అందనిది ఆత్మ. ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ములు అతి తక్కువ. సద్వస్తువును మానవాళికి ఎరుకపరచడంలో వారిలో ఎవరి ప్రత్యేకత వారిది. నాన్నగారిలాంటి మహాత్ములను చూడలేదు, వినలేదు. భవిష్యత్‌లో కూడా చూడతరమా?!? అట్టి మహాత్ముని గురించి 'జ్ఞానఫలం' రూపంలో అమూల్యమైన కానుకని పెద్దిరాజుగారి ద్వారా అందజేయాలనేది ఈశ్వర ప్రణాళిక కాబోలు.

నాన్నగారి అపారమైన హద్దులు లేని దివ్యప్రేమని, దయని, కరుణని, వాత్సల్యాన్ని, భక్తులతో ఆయనకున్న అనుబంధాన్ని, ఆయన జీవన గమనాన్ని, సంకల్పాన్ని కళ్లకు కట్టినట్లుగా, మనసుకి హత్తుకునేలా అమోఘంగా అక్షరబద్ధం చేసారు పెద్దిరాజుగారు.

'అనుదినం భగవాన్‌తో' (Day to Day with Bhagavan) వలె భక్తులతో

అనుదినమూ జరిగే నాన్నగారి సంభాషణలు, సన్నివేశాలూ చదువుతూంటే వారి సన్నిధిలో ఉన్నట్లే అనుభూతి కలిగింది. ప్రత్యేక పర్వదినాలు,ఉత్స వాల గురించిన వర్ణన ఎంతో బావుంది. భక్తులతో ఆయన యాత్రలు, అరుణాచల నివాసం గురించి శ్రద్ధతో సేకరించిన విషయాలు ప్రేమతో నిండిన హృదయంతో వ్రాసి, నాన్నగారితో శిష్యులు గడిపిన ఆ మధుర క్షణాలను మా మనోఫలకంపై పునరావిష్కరణ చేసారు రచయిత.

ద్వాపరయుగంలో బృందావనంలో కృష్ణుడికి, గోపికలకి మధ్య గోచరించిన లీలలతో కూడిన సంఘటనలు ఇప్పటికీ పారవశ్యము కలిగి స్తూనే ఉంటాయి కదా! ఆ ప్రేమ, ఆ భక్తి, ఆ శరణాగతిని ఏమని వర్ణించ గలము? ఆ ఘట్టమే పునరావృతమయిందా అనిపించే విధంగా నాన్నగారితో శిష్యుల అనుబంధం, సాన్నిహిత్యంలో అదే ప్రేమ, అదే భక్తి, అదే శరణాగతి ఆవిష్కృతమవుతుంది.

నాన్నగారితో నాలుగు దశాబ్దాల అనుబంధంలో శిష్యులకు ప్రతి క్షణం స్ఫురణకు వచ్చే దృశ్యాలు, సంఘటనలు ఎన్నెన్నో... ఆయన చిరునవ్వు ఎప్పటికీ వారి కళ్లలో గోచరిస్తూనే ఉంటుంది. ఆయన పలుకులు వారి చెవుల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఆయన నిరంతరబోధ వారి హృదయా లలో ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అటువంటి మనోహర దృశ్యాలను పునరావి ష్కృతం చేస్తున్న ఈ పుస్తకం భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతుందని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

ఈ అపురూపమైన పుస్తకం భావితరాలకు మార్గదర్శిగా, హృదయ విశాలత్వం పెంచే విధంగా, మధురంగా రూపొందించబడింది. మాతృమూర్తి ఔన్నత్యాన్ని భావితరాలు గుర్తెరిగి మసులుకోవడానికి ఇది ఉపయుక్తం కాగలదు. ఇంతే కాకుండా అరుణాచలేశ్వరుని, భగవాన్ రమణుని స్తుతిస్తూ వ్రాసిన గీతాలు, మాతృమూర్తి గురించి వ్రాసిన గీతాలు ఈ పుస్తకానికి సంపూర్ణత్వాన్ని అందించాయి.

జీవిత పర్యంతం నాన్నగారు ఆధ్యాత్మిక ప్రవచనాలుగా చేసిన బోధనల

సారాన్ని చాలా చక్కగా, ఎంతో సులభంగా, మధురంగా, మృదువుగా ఈ 'జ్ఞానఫలం'లో నిక్షిప్తం చేయడం జరిగింది.

అరుణాచలేశ్వరుని 'భగవాన్ అక్షరమణమాల'లో అలంకరించినట్లు 'శ్రీ నాన్నగీతం'లో నాన్నగారిని అలంకరించడం ఎంతో చక్కగా, ఆహ్లాద కరంగా ఉంది.


పెద్దిరాజుగారికి నాన్నగారి పట్ల ఉన్న భక్తి విశ్వాసాలు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. వారికి నా హృదయపూర్వక నమస్కారములు.


**– డా॥ ఉష**

# విషయసూచిక


1. శ్రీ నాన్న అష్టోత్తర శతనామావళి ........ 1
2. శ్రీ నాన్న గీతాంజలి ........ 6
3. శ్రీ నాన్న గీతం ........ 10
4. శ్రీ నాన్న సన్నిధి ........ 15
5. గురూపదేశాలు – లోకోపమానాలు ........ 21
6. ఆత్మబంధువు ........ 23
7. ఆనందసాగరం ........ 24
8. గోదావరివాసులు – ధన్యజీవులు ........ 26
9. గురుపౌర్ణమి ........ 28
10. నాన్నగారు – అరుణాచలం ........ 30
11. రమణక్షేత్రం – జిన్నూరు ........ 33
12. శుభకార్యాలు ........ 35
13. శిష్యులు – యోగక్షేమాలు ........ 36
14. ఈతిబాధలు ........ 37
15. హృదయవాసి ........ 39
16. జ్ఞాన నేత్రాలు ........ 40
17. నాన్న–బిడ్డల అనుబంధం ........ 41
18. రావిచెట్టు – చిగురుటాకులు ........ 43
19. ఆధ్యాత్మిక బాట – మనసులో మాట ........ 44
20. జగమంతా బంధుత్వాలు – ఒంటరి జీవితాలు ........ 46
21. గురువైభవం ........ 49
22. ప్రేమక్షేత్రం ........ 54
23. రావోయి... గురుదేవా! ........ 58
24. రమణ తరంగం ........ 61
25. మాతృదేవోభవ ........ 67
26. మాతృ ప్రేమ ........ 69

# సద్గురు నాన్నగారి ఆశీర్వచనాలు









# దశాబ్దాల అనుబంధం - నాన్నగారి ఆవాసం









# సద్గురు పాద సన్నిధి - శాంతి సౌభాగ్యాలకు పెన్నిధి







# సద్గురు శ్రీ నాన్నగారి దివ్య సమాధి - జిన్నూరు



"నా శరీరము మరణించినా నేను శిష్యుల హృదయాలలో జీవించే ఉంటాను.
దుఃఖము లేని స్థితికి వారిని తీసుకువెళ్లడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను"

– సద్గురు శ్రీ నాన్నగారు

# శ్రీ నాన్న అష్టోత్తర శతనామావళి

ఓం ఆత్మజ్ఞానియే నమః
ఓం పావనమూర్తియే నమః
ఓం పవిత్రమూర్తియే నమః
ఓం జ్ఞానమూర్తియే నమః
ఓం మందహాసమూర్తియే నమః
ఓం విశ్వమూర్తియే నమః
ఓం గుణసాగరాయ నమః
ఓం ఓంకారమూర్తియే నమః
ఓం ఉజ్వలమూర్తియే నమః
ఓం లోకబాంధవాయ నమః 10

ఓం అద్వితీయమూర్తియే నమః
ఓం కారుణ్యమూర్తియే నమః
ఓం కరుణామయాయై నమః
ఓం రమణీయమూర్తియే నమః
ఓం విశాలహృదయే నమః
ఓం నిత్యానందమూర్తియే నమః
ఓం హృదయేశ్వరాయై నమః
ఓం జ్ఞానబాంధవే నమః
ఓం వసుదైకమూర్తియే నమః
ఓం మార్గదర్శియే నమః 20

ఓం తేజోమూర్తియే నమః
ఓం ప్రేమైకమూర్తియే నమః
ఓం నిరుపమానమూర్తియే నమః

ఓం శాంతిసాగరాయై నమః

ఓం ధర్మమూర్తియే నమః

ఓం వివేకమూర్తియే నమః

ఓం చిరుదరహాసై నమః

ఓం మహోన్నతమూర్తియే నమః

ఓం మనోనాశనదార్శనికాయ నమః

ఓం సత్సంకల్పమూర్తియే నమః 30

ఓం ఔదార్యమూర్తియే నమః

ఓం కమలనయనాయ నమః

ఓం సహజసౌందర్యమూర్తియే నమః

ఓం జ్ఞానసాగరాయ నమః

ఓం జిన్నూరువాసియే నమః

ఓం గురవే నమః

ఓం దయార్ద్రహృదయాయ నమః

ఓం సత్వగుణాయ నమః

ఓం ధవళవస్త్రధారిణే నమః

ఓం చిద్విలాసమూర్తియే నమః 40

ఓం శాంతచిత్తాయ నమః

ఓం శాంతిస్వరూపాయ నమః

ఓం నిరాడంబరమూర్తియే నమః

ఓం నాన్న గురుదేవాయ నమః

ఓం ఆత్మీయమూర్తియే నమః

ఓం లక్ష్మీనరసింహాయ నమః

ఓం అరుణాచల అంశయే నమః

ఓం రమణతరంగాయ నమః

ఓం భానుమూర్తియే నమః
ఓం ప్రసన్నవదనాయ నమః 50

ఓం జ్ఞానసూర్యాయ నమః
ఓం విచారణామార్గ ప్రబోధకాయ నమః
ఓం అరిషడ్వర్గ విసర్జితాయ నమః
ఓం జీవన్ముక్తి ప్రదాతాయ నమః
ఓం సత్వగుణ సంపన్నాయ నమః
ఓం శ్రావ్యకంఠాయ నమః
ఓం ఆపన్నహస్తాయ నమః
ఓం విశాల నేత్రాయ నమః
ఓం పామర జన పెన్నిధియే నమః
ఓం జిన్నూరు రమణక్షేత్ర స్థాపకాయ నమః 60

ఓం సత్యశోధకాయ నమః
ఓం మనోక్లేశ నిర్మూలనాయ నమః
ఓం హృదయశాంతి స్థాపకాయ నమః
ఓం మౌనభాష ప్రేరేపితాయ నమః
ఓం శుభకరాయ నమః
ఓం రాగద్వేష ద్వేషియే నమః
ఓం వినమ్రమూర్తియే నమః
ఓం అంతరదృష్టి ప్రోత్సాహకాయ నమః
ఓం పద్మపాదాయ నమః
ఓం కోమల శరీరాయ నమః 70

ఓం పుణ్యపురుషాయ నమః
ఓం జ్ఞానజ్యోతియే నమః
ఓం హృదయవాసియే నమః

ఓం మకరందభాషియే నమః
ఓం ముగ్ధమనోహరరూపాయ నమః
ఓం శాంతిసాగరాయ నమః
ఓం రాజయ్యమ్మ పుత్రాయ నమః
ఓం మృదుస్వభావియే నమః
ఓం భక్తజన బాంధవాయ నమః
ఓం మానవతామూర్తియే నమః 80

ఓం నిత్యప్రవచనకర్తయే నమః
ఓం గృహస్తాశ్రమవాసియే నమః
ఓం నిరహంకారరూపియే నమః
ఓం చైతన్యరూపాయ నమః
ఓం చిద్విలాసమూర్తియే నమః
ఓం సేవాపరాయణాయ నమః
ఓం భవబంధ విముక్తాయ నమః
ఓం అనుగ్రహ స్వరూపాయ నమః
ఓం కరుణాసముద్రాయ నమః
ఓం ద్వైతబుద్ధి విసర్జితాయ నమః 90

ఓం అద్వైత శిఖర అధిష్టితాయ నమః
ఓం కరుణామృత వర్షితాయ నమః
ఓం ఆత్మవిద్య ప్రబోధకాయ నమః
ఓం సత్సాంగత్య ప్రోత్సాహకాయ నమః
ఓం చంద్రబింబ ముఖారవిందాయ నమః
ఓం స్థిరచిత్తాయ నమః
ఓం సద్గురుదేవాయ నమః
ఓం హృదయస్థాన శోధితాయ నమః

ఓం హృదయసామ్రాజ్యాధీశాయ నమః

ఓం మమతల కోవెలయే నమః 100

ఓం హాస్యచతురతాయ నమః

ఓం కుశాగ్రబుద్ధియే నమః

ఓం పూర్ణాయ నమః

ఓం మృదుభాషిణే నమః

ఓం మౌనభాషిణే నమః

ఓం లోకకళ్యాణకారకాయ నమః

ఓం రమణపుత్రాయ నమః

ఓం ఆత్మవిచారణామార్గ దార్శనికాయ నమః 108



*దేహమును ప్రారబ్ధమునకు విడిచిపెట్టి, మనము స్వరూప జ్ఞానము సముపార్జించుకునే ప్రయత్నం చేయాలి. స్వరూపములోనే శాంతి ఉంది.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# శ్రీ నాన్న గీతాంజలి

1. ఓ చిరుదరహాసమా, చిద్విలాసమా
చిన్నికృష్ణుని చిరునవ్వు నీ పెదవులపై దాచినావు

2. ఓ కరుణాసముద్రమా, శాంతిసాగరమా,
భక్తుల కన్నీటి ధారలను నీ హృదయసాగరములో
లయము చేసినావు

3. ఓ భక్తజన బంధువా, ఆత్మబంధువా
ఇది ఈ జన్మ బంధము కాదు, జన్మాంతరాల బంధమే!

4. భౌతికంగా జిన్నూరు వాసివి నీవు, కాని హృదయవాసివే
జన్మాంతర వాసనలను క్షయము చేసే జ్ఞానివి నీవు

5. అభాగ్యులను అక్కున చేర్చుకునే ఆత్మీయుడివి నీవు
అజ్ఞానులపై జ్ఞానకిరణాలను ప్రసరించే జ్ఞాన సూర్యుడివి నీవు

6. శిష్యుల యోగక్షేమాలను విచారించు యోగివి నీవు
దేహ బాధలను మైమరపించే మహోన్నత మూర్తివి నీవు

7. ఈ క్షేత్రాలకు (శరీరాలకు) రమణక్షేత్రము కేంద్రంగా
జ్ఞానబోధ చేసినావు
అర్ధశతాబ్దిగా అలుపెరుగక జ్ఞానఫలాలను పంచినావు

8. పున్నమి వెన్నెలలో చల్లదనాన్ని నీ మోములో దాచినావు
మకరందములోని తీయదనాన్ని నీ మాటల్లో పలికించినావు

9. ప్రాతఃకాలంలో నిరీక్షించే ముముక్షువులకు
బాలభానుని వలె దర్శనమిచ్చెదవు
గోధూళి వేళలో ఇంటికి పయనమయ్యే భక్తులు
భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పెదరు నీకు

10. అన్నప్రాశన వేళ గోరుముద్దలు తినిపించే తల్లిలా
శిష్యులకు జ్ఞానమనే పరమాన్నాన్ని గోరుముద్దలుగా చేసి
నోట పెట్టినావు

11. నీ సన్నిధి ఆత్మీయతలకు నెలవట - వాత్సల్యానికి వారధియట
మమతానురాగాలు సన్నజాజి తీగలా సుకుమారంగా
అల్లుకుపోయెనుగా

12. విచారణా మార్గాన్ని వజ్రాయుధంగా మలచినావు -
మనస్సుతో పోరాడి ధీరుడైనావు
పోరాట పటిమ లేని ఈ బీరువులకు
శరణాగతియనే మార్గాన్ని చూపినావు

13. ప్రేమతత్వాన్ని హృదయంలో దాచిన ప్రేమైక మూర్తివి నీవు
అరిషడ్వర్గాలను ఆమడదూరం పారదోలిన అద్వితీయ శక్తివి నీవు

14. అపార సేవానిరతి నీ సహజగుణమట, పేదల పాలిట పెన్నిధివట
జ్ఞానములేని పేదలు నీ చెంతకు చేరి
జ్ఞానసంపదను పొంది ధనవంతులైనారట

15. నీ దర్శనమునకై అరుదెంచిన సామాన్య శిష్యులైనా
మర్యాదలు, మన్ననలు పొందినారు
బరువెక్కిన హృదయాలతో వచ్చినా, దర్శనభాగ్యముచే
దూదిపింజలా మారినారు

16. అరుణాచలంతో నీ అనుబంధము
జన్మజన్మాంతరములదని చెప్పినావు
మలిన పొరలలో చిక్కుకున్న మమ్ము విముక్తి చేయంగ
మా చెంతకే వచ్చినావు

17. పాయసం తాగినంత ఇష్టంగా
ప్రారబ్ధాన్ని అనుభవించమని చెప్పినావు
మనోకల్పిత ప్రపంచంలో తామరాకుపై నీటిబిందువులా
జీవించమని బోధించినావు

18. గౌతమ బుద్ధుని ప్రశాంత చిత్తము, ఆదిశంకరుని జ్ఞానవైభవం,
రమణుని నిర్వికార నిత్యానంద స్వరూపం,
రామకృష్ణుని భక్తియోగం నీలో కాంచినాము

19. పేరుపేరున నీ చెంతకు వచ్చిన వారందరినీ ప్రేమతో
పలకరించినావు
హృదయంతో భాషించి అలజడులను అణచివైచి
శాంతబరచినావు

20. మంచి మనస్సులనే లోకుల పొగడ్తలకు పొంగిపోయినాము
మనస్సే లేదని మనోలయమవ్వాలని చెబుతుంటే
బిత్తరపోయినాము

21. రూపబుద్ధిని, నామబుద్ధిని రూపుమాపమంటివి
వాటితోనే సహజీవనం చేస్తున్న మాకు దారేది చెప్పుమా...

22. అన్ని మార్గములకన్నా విచారణా మార్గమే మిన్నయని
విచారించి చెప్పావు
బాహ్యాడంబరాలకు అలవాటుపడిన ఈ మనస్సుకు
గుర్తింపు పోవునే అని చింతగానున్నది

23. భగవాన్ పిల్లవాడిగా (Child of Bhagavan) నిన్ను సంబోధించే
పాశ్చాత్యుల మాటలకు మురిసిపోయినావు
పసివానిలో ఉండే సహజత్వం, నిష్కపటం వంటి దైవీ గుణాలతో
నిండిన మేరుపర్వతం నీవు

24. 'నాన్నగారు' అనే పిలుపుకే వారి బాధ్యతలన్నీ
భుజములపై మోసినావు
వాత్సల్యపూరిత చూపులతో దరిచేరిన వారందరికీ
పుట్టింటి ప్రేమను పంచినావు

25. నీ కళ్లల్లో కళ్లుపెట్టి చూడంగ శక్తిలేదు.
మాంసనేత్రాలతో జ్ఞాననేత్రాలను చూడతరమా?
సవినయంగా వేడుకొనుచున్నాము లోకబాంధవుడవైన
నీవు మాకు లోచూపు నేర్పించుమా

26. చిరుగాలికి ఊగిసలాడే రావిఆకుల్లా, చిరువాసనలకు
చలించే మనోదుర్భలులము
స్వచ్ఛమైన నిచ్ఛలమైన కోనేరు చెంతకు వచ్చినారము.
మా హృదయాలలో జ్ఞానమనే కలువలను పూయించుము తండ్రీ

27. దవళ వస్త్రధారణతో పరమహంసలా ఠీవియైన స్వరూపము నీది
కాకుల వంటి మా నోట జ్ఞానమనే పలుకులను పలికించి
కోకిలలుగా మార్చ ప్రతినబూనినావు

28. కొమ్మకొమ్మకు గెంతులాడే కోతి వంటి మనస్సును ఏమార్చి
హృదయం వైపు వెళ్ళే దారి చూపినావు
హృదయంలోకి వెళ్లనని ద్వారం చెంతనే మారాం చేస్తున్న
మనస్సును నెట్టంగ నీవే తోడుండుము తండ్రీ

29. తొలకరి జల్లులా హాస్యాన్ని కురిపించి మనస్సును తేలిక చేసినావు
ఆధ్యాత్మిక ప్రవచనాలలో సొగసైన హాస్యము మేళవించి
చెవులకింపు చేసినావు

30. బిందువులా ప్రారంభమైన గోదావరి రాజమహేంద్రవరం వద్ద
సింధువులా పొంగిపొర్లినట్లే
నేనుతో ప్రారంభమైన నీ ప్రవచనం ఉప్పొంగే గోదారిలా
గంభీరత్వమొందెను కదా!

31. పవిత్ర గోదావరి గౌతమి, వశిష్ఠ, వైనతేయ పాయలుగా
విడివడి సాగరంలో కలిసినట్లు
నాన్నగారి ప్రవచనం భక్తి, జ్ఞాన, కర్మ మార్గాలుగా విడివడి
హృదయసాగరంలో లయమగునుగా

32. పేరులో సౌభాగ్యాన్ని, దేవతలను హృదయంలో
దైవీగుణాలను ఇమిడ్చినావు
సాత్విక గుణ సంపదతో నిన్నాశ్రయించిన
ఆర్తులకు అమృతత్వాన్ని పంచినావు

33. సైకిలుపై ఊరూర తిరిగి ప్రవచనాలు చెప్పిన రోజులున్నవట
నేడు విమానాల్లో పయనించి ఆత్మజ్ఞానం కోసం
నీ చెంతకే వచ్చిన సంపన్నులెందరో

34. కర్మఫలాన్ని అనుభవించగ వచ్చిన జీవులకు జ్ఞానఫలాన్నిచ్చినావు
కర్తృత్వ భావన విడనాడి కర్మ చేయమని ఖచ్చితంగా
సెలవిచ్చినావు

# శ్రీ నాన్నగీతం

1. అందరి మదిలో అనురాగాన్ని నింపి
అలజడులను పారదోలిన అపురూపమూర్తికి వందనం

2. 'ఆత్మబంధువుల్లారా...' అనే సంబోధనతో భక్తుల హృదయాలలో
ఆత్మీయతను నింపిన ఆత్మజ్ఞానికి వందనం

3. ఇహలోక ఇక్కట్లను అలవోకగా పారద్రోలి
పరమానందాన్ని పంచిపెట్టిన పావనమూర్తికి వందనం

4. ఈ జన్మ పరమార్థాన్ని విపులంగా విశదపర్చి
మా హృదయాలలో పదిలపర్చిన పవిత్రమూర్తికి వందనం

5. ఉనికిలేని మనస్సును పదునైన మాటలతో పలుచన చేసి
పారవశ్యం నింపిన సుగుణాభిరామునికి పాదాభివందనం

6. ఊయలలో పిల్లవాడికి జోలపాడి నిద్రపుచ్చే తల్లిలా
ఊరటనిచ్చే మాటలతో బాధలను మైమరపించే భానుమూర్తికి వందనం

7. ఋగ్వేదం నుండి ఋషుల వరకు, సామవేదం నుండి
సన్యాసుల వరకు
కోకొల్లలుగా ఉదాహరణలతో జ్ఞానాన్ని పంచిపెట్టిన జ్ఞానమూర్తికి
వందనం

8. ఎందరో పామరులకు విషయ జ్ఞానాన్ని ఎరుకపర్చి
ఎదలో, మదిలో మలిన పొరలను తొలగించిన మందహాస
మూర్తికి వందనం

9. ఏసుక్రీస్తు నుండి సోక్రటీసు వరకు, తులసీదాసు నుండి
గాంధీజీ వరకు
సద్గుణాలను తెలియజెప్పి జీవన్ముక్తులను చేయగోరే
గురుదేవులకు వందనం

10. 'ఐ'ని వదలమని, అన్ని బంధాలకూ అదే మూలమని
ముముక్షువులకు ముచ్చటగొలిపే మాటలతో
విశదపర్చిన విశ్వమూర్తికి వందనం

11. ఒదిగే గుణం, సహనం జ్ఞానమార్గానికి తొలిమెట్టని
అవినయం, అసహనంతో
స్వస్వరూపానికి దూరమౌతారని అతిసరళంగా ఎరుకపర్చిన
గుణసాగరునికి వందనం

12. ఓర్వలేని గుణం వదిలిపెట్టమని ఓపికగా విశదపర్చిన
ఓంకారమూర్తికి వందనం, అభివందనం...

13. ఔపోసన పట్టిన ఉద్గ్రంధాలలోని మాటలను ఉగ్గుపాలవలె
రంగరించి ఊరడించిన ఉజ్వలమూర్తికి వందనం

14. అందరిలో ఒకరిలా కనిపించే ఈ మాంసనేత్రాలకు
జ్ఞాననేత్రాలతో లోచూపు నేర్పించే లోకబాంధవునికి వందనం

15. 'ఆహా...' అనిపించే రూపలావణ్యంతో అందరి మదిలో నిలిచే
అద్వితీయమూర్తికి హృదయాభివందనం

16. కన్నవారింటికి వచ్చిన అనుభూతిని పొందేట్లు
ఆదరించి అభిమానించిన నాన్నగురుదేవులకు వందనం

17. కాకుల వంటి లోకులను కమనీయమైన మాటలతో
కోకిలలుగా మార్చిన కారుణ్యమూర్తికి వందనం

18. కించిత్ భేషజము లేక క్రిందికి దిగజారే శిష్యరేణువులను
ఆప్యాయంగా ఆదరించి అక్కున చేర్చుకునే ధీరోదాత్తునికి వందనం

19. క్రీగంటి చూపులతో కన్నీళ్ళను కరిగించి
కలిమిలేములనే భేదంలేక కడుపార పలకరించే
కరుణామయునికి వందనం

20. కృపాకటాక్షాలే గవాక్షాలై కడుజాగరూకతతో
ఆదరించే కడు రమణీయమూర్తికి వందనం

21. కుందనపు బొమ్మలాంటి మేనిఛాయతో
మనోకురూపుల్లాంటి మమ్ము చేరదీసిన ఔన్నత్యమూర్తికి వందనం

22. కూపస్థ మండూకాలను సాగరతీరపుటంచులకు
చేర్చిన విశాలహృదయునికి వినయపూర్వక వందనం

23. కెరటంలోనున్నది నీరేనని, దానిని కెరటంగా చూడవద్దని,
ఆత్మనుండి నీవు వేరుకాదని నిశితంగా విశదపర్చిన
నిత్యానందమూర్తికి వందనం

24. కేవలం ఉన్నది నీవే ఆత్మగానేనని ఎరుకపర్చి
ఆత్మకు భిన్నమైన 'నేను'కు ఉనికి లేదని తేటపర్చిన
హృదయేశ్వరునికి వందనం

25. కైలాసంలోనున్న శివుడు, నీ హృదయంలోనున్న
సద్వస్తువు వేరుకాదని
ద్వైతభావన వీడాలని అజ్ఞానులైన మాపై జ్ఞానకిరణాలను
ప్రసరించే జ్ఞానబాంధవునికి వందనం

26. కొబ్బరినీళ్ళవంటి తియ్యనైన మాటలతో, కొబ్బరిపెంకువంటి
కఠినమైన ఉపనిషత్ భావజాలాలను విపులంగా విశదపర్చిన
వసుధైకమూర్తికి వందనం

27. కోరికలు దుఃఖహేతువులని, దుఃఖనివారణకు మార్గమున్నదని,
సిద్ధార్థుడు బుద్ధుడైన వైనాన్ని విశదపర్చిన జ్ఞానబోధకునికి వందనం

28. కంఠంలోనున్న మాధుర్యంతో కంటికొనలలో చేరిన కన్నీటిని
తుడిచి, కలువశోభితులుగా మార్చిన కడురమ్యమూర్తికి వందనం

29. గద్గద స్వరంతో వేడుకునే గమ్యంలేని బాటసారులకు
మృదువైన ఆధ్యాత్మికబాటని చూపిన మార్గదర్శకునికి వందనం

30. ఘనమైన కీర్తికాంక్ష బంధహేతువని, ఆత్మ ఎరుకకు
ప్రతిబంధకమని ఘనంగా చాటిచెప్పిన ఘనాపాటికి వందనం

31. టంకశాలలో ముద్రించిన నాణెంకన్న నీ హృదయంలోనున్న
సద్వస్తువును
తెలుసుకోవడం మిన్న అని తేటపర్చిన తేజోమూర్తికి వందనం

32. టాటా చెప్పాలి అరిషడ్వర్గాలకని
శాంతితత్వాన్ని ప్రబోధించిన ప్రేమైకమూర్తికి వందనం

33. ఢాంబికాన్ని వదిలి నిరహంకారంగా ఉండాలని,
నిరాడంబరతను నేర్పిన నిరుపమానమూర్తికి నిత్య వందనం

34. తలంపుల సమూహమే మనసని, అది హృదయంలో అణిగిపోతే
శాశ్వత శాంతిని పొందగలమని ఎలుగెత్తి చాటిన
శాంతిసాగరునికి వందనం

35. దరహాసంతో దప్పికగొన్న భక్తజన బాహుళ్యం
దప్పిక తీర్చిన ధర్మమూర్తికి వందనం

36. దేహబుద్ధి బందహేతువని, అశాంతికి మూలమని
అజ్ఞాన జనితమైన దేహబుద్ధిని విడనాడమనే వివేకమూర్తికి వందనం

37. నా, నేను అనే తలంపులు దేహతాదాత్మ్య జనితాలని
హృదయంలో సద్వస్తు ఎరుకకు
హృదయపవిత్రత ఉండాలనే చిరుదరహాసునికి వందనం

38. పరిమళ భరితమైన స్వరూపంతో శిష్యగణకోటికి
సుగంధ పరిమళాలు వెదజల్లిన మహోన్నతమూర్తికి వందనం

39. భక్తిమార్గంతో ముముక్షువులు బంధవిముక్తులై
పరమాత్మను చేరవచ్చనే భక్తజనబాంధవునికి వందనం

40. మనస్సును చింతించడమే దాని రూపనాశనమునకు మార్గమని
మనోనాశనమే మోక్షకారకమనే మనోనాశనదార్శనికునికి
హృదయపూర్వక వందనం

41. యజ్ఞయాగాదులతో పనిలేదని, యాంత్రిక పూజలు వ్యర్థమని
స్వస్వరూపమెరుకకై ఆత్మవిచారణే శ్రేష్ఠమని
విశదపరచిన విశ్వప్రేమికునికి వందనం

42. రజో, తమోగుణాలు బంధహేతువులని, సత్పురుషుల
సహవాసంతో సత్వగుణం పొందాలని
సత్సాంగత్యమే స్వస్వరూపజ్ఞానానికి బాటయని బోధపర్చిన
సత్సంకల్పమూర్తికి వందనం

43. వాసనాక్షయమై పరిపూర్ణానందం అనుభవంలోకి వచ్చేవరకు
జన్మజన్మలకు గురువు వెన్నంటి ఉంటాడని, వెన్నుతట్టి లేపిన
ఔదార్యమూర్తికి వందనం

44. శరణాగతి పొందడమే మోక్షప్రాప్తికి అత్యున్నత మార్గమని
భగవత్సంకల్పమే, భక్తుడిసంకల్పమనే భక్తజనబాంధవునికి
భక్తిపూర్వక వందనం

45. సత్పురుషులతో సహవాసం సద్వస్తువు ఎరుకకి పూలబాటయని,
సహవాసదోషాలు ప్రతిబంధకాలని, సరళమైన మాటలతో చెప్పిన
సహజసౌందర్యమూర్తికి వందనం

46. జిన్నూరు వాసిగా, జిజ్ఞాసువులకు అర్థశతాబ్దిగా
జ్ఞానకిరణాలను ప్రసరించి
జ్ఞానమార్గాన్ని ప్రబోధించే జ్ఞానసాగరుడు సద్గురు
నాన్నగురుదేవులకు పాదాభివందనం



*గురువు మాట అనుగ్రహం. మౌనం అనుగ్రహం*

– సద్గురు శ్రీ నాన్నగారు

# శ్రీ నాన్న సన్నిధి

రమణ భక్తులకు ఆత్మబంధువు, ప్రేమైకమూర్తియైన నాన్న గురుదేవులు భౌతికంగా జిన్నూరు నివాసి. శిష్యరేణువుల హృదయ నివాసియైన సద్గురువుల ఇంటి సందర్శన మరపురాని మధురానుభూతి. అది ఆత్మీయతలకు నెలవు. మమతానురాగాలకు నివాసం. ప్రకృతిశోభకు నిలయమైన సుందరమైన గ్రామం జిన్నూరు.

ప్రతిరోజూ ఎందరో భక్తులు నాన్నగారి సందర్శనకై జిన్నూరు వస్తుంటారు. జాతీయ రహదారి నుండి మార్టేరు మీదుగా జిన్నూరు ప్రయాణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పచ్చని పంటపొలాలను వీక్షిస్తూ సాగిపోయే ప్రయాణం నయనానందకరంగా ఉంటుంది. ముందుకు సాగే ప్రయాణం కాలవలో నీటి ప్రవాహంలా కాలగమనాన్ని జ్ఞప్తికి తెస్తుంది. గతించిన కాలం ముందుకు రాదు. ముందుకు ప్రవహించే నీరు వెనుకకు మరలదు. ఈ సత్యం స్ఫురణకు వస్తుంది.

మైలురాయిపై జిన్నూరు అనే అక్షరాలు కనిపించగానే వంతెనపై నుండి గ్రామములోనికి ప్రవేశము ముముక్షువులకు భౌతికమైన మార్గంలో పయనిస్తూ ఆధ్యాత్మిక మార్గానికి మరలడానికి సంకేతంగా ఆ వంతెన సాక్షీభూతంగా నిలుస్తుంది. పచ్చదనంతో కళకళలాడే ఎన్నో గ్రామాల మీదుగా ప్రయాణం సాగినా మానసిక ఉల్లాసమేగానీ హృదయ సంబంధమైన శాంతిని పొందేది ఇక్కడే.

జిన్నూరు గ్రామానికి ఏమిటా ప్రత్యేకత? అరుణాచల అంశయైన జ్ఞానసాగరం, రమణ తరంగం, ప్రేమస్వరూపం అయిన సద్గురు నాన్నగారి ఆవాసము ఈ గ్రామంలోనే కదా! అందుకే ఆ ప్రత్యేకత. అర్ధశతాబ్దిగా లక్షలాది మంది భక్తులు ఈ గ్రామాన్ని సందర్శించారు. సందర్శిస్తూనే ఉంటారు. శిష్యులందరిదీ ఒకే ఆశ. నాన్నగారితో ఆత్మీయతను పంచుకోవాలి. వాత్సల్యాన్ని చవిచూడాలి. హృదయశాంతిని పొందాలనే తపన.

ఇక్కడనుండి వెళ్ళేటప్పుడు మమతానురాగాలను తీసుకుని వెళ్ళాలి. ఆ హక్కు వారందరికీ ఉంది. ఇది పుట్టినిల్లు కదా!

జిన్నూరు వంతెనపై నుండి గ్రామంలోనికి ప్రవేశించగానే ఏదో చక్కటి అనుభూతి హృదయంలో కలుగుతుంది. పంటకాలువలో ప్రవహించే నీరు నాన్నగారి వాక్ప్రవాహాన్ని గుర్తుకు తెస్తుంది. వంతెనపైనుండి చూడగానే విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి కాలువ ప్రక్కనున్న ఉన్నతపాఠశాలవైపు వెళ్ళే విద్యార్థులు ఒకవైపు, ఆత్మచదువు నేర్చుకోవడానికి నాన్నగారి ఇంటివైపు వెళ్ళే జిజ్ఞాసువులు ఒకవైపు కన్పిస్తుంటారు.

వంతెన నుండి ఫర్లాంగుదూరం వెళ్ళాక గుఱ్ఱపుస్వారీ చేస్తున్న సర్ ఆర్థర్‌కాటన్ గంభీరమైన విగ్రహం రహదారికి కుడివైపున కన్పిస్తుంది. గోదావరి జిల్లావాసులకు అన్నం పెట్టిన అపురూపమైన ధవళేశ్వరం ప్రాజెక్టు రూపశిల్పిని కృతజ్ఞతాపూర్వకంగా వీక్షిస్తారు. అచటనుండే అజ్ఞానమనే ఆకలిని తీర్చగ వేచియున్న జ్ఞానభాండాగారమైన నాన్నగారి రూపం స్ఫురణకు వస్తుంది. ప్రక్కనున్న ఆలయంలోని సుబ్రహ్మణ్యుని మనోహర రూపమును స్మరించుకుని, శాఖాగ్రంథాలయం, ఆరోగ్యకేంద్రాలను దాటి రెండు ఫర్లాంగుల దూరంలో కుడివైపు మలుపు తిరగగానే సుందరమైన కోనేరు తామరాకులతో, తామరపూవులతో ఆహ్లాదకరంగా కన్పిస్తుంది. కోనేరు గట్టుపై నారికేళ వృక్షాలు పచ్చని ఆకులతో, గెలలతో ఇంపుగా ఉంటాయి. కోనేరు చుట్టూ అందమైన పెంకుటిళ్లు, భవనాలు, వాటి వెనుక పచ్చటి పొలాలు ప్రశాంత వాతావరణంతో ఉల్లాసభరితంగా ఉంటుంది.

కోనేరు గట్టుపైనున్న రావిచెట్టు ఆకులు చిరుగాలికి కదలాడుతూ చిరువాసనలకు, తలంపులకు ఊగిసలాడే చంచలమైన మనస్సుకు చిహ్నంగా కన్పిస్తుంటాయి. కోనేరులో నీరు స్వచ్ఛంగా, అలజడులు లేక నిర్మలంగా ఉంటుంది. హృదయ ప్రశాంతతకు పోలికలా కోనేరు కనబడుతుంది.

కోనేరు ప్రక్కన గల ప్రాథమిక పాఠశాల దాటిన వెంటనే ఎడమవైపు తిరగగానే ఏదో పులకింత. అక్కడనుండి ఆ వీధిలో కుడివైపు కన్పించే ఇంటివైపు ఒకసారి మమకారంతో చూడటం సహజంగా జరిగే దృశ్యం.

నాన్నగారు అప్పటికే అరుగుపై ఉన్నారేమో అని ఆశ.

అదియొక అందమైన పెంకుటిల్లు. విశాలమైన అరుగు. చుట్టూ తగినంత ఖాళీ స్థలం. ఆ అరుగే ఎన్నో సంవత్సరాలుగా లక్షలాదిమంది భక్తులకు మానసిక ఉల్లాసాన్ని, మనోవికాశాన్ని, హృదయశాంతిని కలిగించిన శాంతినిలయం, ఈతి బాధలను మైమరపించిన పవిత్ర స్థలం. ఏ సమయం లో వెళ్ళినా కొందరు ముముక్షువులు అరుగుపై కనబడతారు.

ఆ అరుగుపై రమణమహర్షి ఫోటో ఒకవైపు, దాని ప్రక్కన నాన్నగారు ఆశీనులవడానికి పరిశుభ్రమైన దుప్పటి వేసిన కుర్చీ కనిపిస్తుంది. మొగ్గలతో గులాబి మొక్కలు నాన్నగారి ఇంటి వాకిటిలో గోడ ప్రక్కగా కనిపిస్తాయి. పెద్ద వయస్కులు ఆశీనులు కావటానికి అరుగుపై సోఫా ఉంటుంది. దూర ప్రాంతాలనుండి, పరిసర గ్రామాలనుండి వచ్చిన కొందరు భక్తులు చేతిలో పండ్లు పట్టుకుని భక్తిభావంతో నాన్నగారి రాక కోసం నిరీక్షిస్తూ ఉంటారు.

ప్రాతఃకాలముననే వచ్చే భక్తుల నిరీక్షణ కన్యాకుమారిలో ఉదయ భానుని వీక్షించడానికి, బాలభానుని లేలేత కిరణాల వెచ్చదనాన్ని ఆస్వాదించ డానికి ఇసుక తిన్నెపై కూర్చొని నిరీక్షించే సందర్శకులను జ్ఞప్తికి తెస్తుంది. జ్ఞానసూర్యుని వీక్షణాలు తమపై ప్రసరించాలనే కాంక్షతో భక్తులు అరుగుపై సుఖాశీనులై ఉంటారు.

నాన్నగారు ఇంటిలో నుండి బయటకు వచ్చి కుర్చీలో ఆశీనులవగానే సూర్యోదయం అయినట్లు, అజ్ఞానాంధకారం తొలగిపోతున్నట్లు, శిష్యులు అనుభూతిని ఆస్వాదిస్తారు. గురుదేవులు ఒక్కొక్కరినీ ఆత్మీయతతో పలక రించి, వారిచ్చే ఫలములు ప్రీతితో స్వీకరించి, భక్తులకు ప్రసాదముగా అందిస్తారు. వారి యోగక్షేమాలు విచారించి, ఈతిబాధలనుండి మైమర పించే విధంగా తరుణోపాయం చెప్పటం పరిపాటి. వ్యవహారిక భాషలోనే భగవద్గీత, రమణతత్వం, ఆధ్యాత్మిక ప్రవచనాలు సందర్భోచితంగా భక్తుల మనస్సులలోనికి నాటుకునేటట్లు చెప్పడం అదొక జ్ఞానప్రవాహంలా సాగి పోతూంటుంది.

గురుదేవులు లోనికి వెళ్ళి స్నానపానాదులు ముగించుకుని, భోజనానంతరం కొంత సమయం భక్తులతో గడుపుతారు. విశ్రాంతి తర్వాత సాయంత్రం మరలా భక్తులకు దర్శనాలు ఇవ్వటం, ఆధ్యాత్మిక సందేశాలు ఇవ్వటం నిత్యకృత్యాలే. పెంకుటిల్లు స్థానంలో భవంతి వచ్చినా ఆ జ్ఞాపకాలు మనసులో కదలాడుతుంటాయి. ఇపుడు భవంతికి ఎదురుగా నున్న షెడ్డు ప్రవచనాలకు వేదిక అయింది. షెడ్డులో అరుణగిరి, భగవాన్, గురుదేవులతో కూడిన ఫ్లెక్సీ ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది.

నాన్నగారు భక్తులందరినీ సానుకూల దృక్పథంతో చూడడం అద్భుతమైన విషయం. ఎవరికి వారు తమ కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, ఉద్యోగాలు, శుభకార్యాలు, ఈతిబాధలు అన్నీ నాన్నగారికి చెప్పుకోవటం పరిపాటి. తరుణోపాయాలు తెలుసుకొని, సలహాలు తీసుకుని నాన్నగారి ఆశీస్సులతో జీవనగమనం సాగిస్తారు. విసుగు, విరామం లేకుండా నిరంతరం సందర్శించే భక్తులకు దర్శనమిస్తారు.

దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రమణాశ్రమంలో విశ్రాంతి తీసుకోమని, భోజనం చేసి వెళ్ళమని చెప్పడం నాన్నగారు భక్తుల యోగక్షేమాలపట్ల చూపించే శ్రద్ధాసక్తులకు నిదర్శనం. అరుణాచలంలో రమణాశ్రమానికి వచ్చే భక్తుల పట్ల మహర్షి ఈ విధంగానే శ్రద్ధ చూపించడం స్ఫురణకు వస్తుంది. నాన్నగారిలో ఉండే నిరాడంబరత చూస్తూంటే, ఆడంబరానికి ఆమడ దూరంలో ఉండే రమణులు జ్ఞప్తికి వస్తూంటారు.

ఊరి చివర పచ్చని పంటపొలాల మధ్య వెలసిన రమణక్షేత్రం భక్తులకు ఆవాసంగా నిలిచింది. రమణజయంతి, వ్యాసపూర్ణిమ, దీపోత్సవం వంటి కార్యక్రమాలు రమణక్షేత్రంలో నిర్వహిస్తారు. దీపోత్సవం రోజున రమణక్షేత్రం విశాలమైన ప్రాంగణంలో అరుణగిరిని ఏర్పరచి, దీపకాంతుల వెలుతురులో సాయంసంధ్య వేళ శాస్త్రీయంగా ప్రతి సంవత్సరం పుణ్యదంపతులచే దీపోత్సవం నిర్వహించడం ఆచారంగా వస్తున్నది. నాన్నగారి సమక్షంలో జరిగే ఈ ఉత్సవం బహుసుందర దృశ్యం. ముందుగా నాన్నగారి ప్రసంగం ఉంటుంది. చుట్టూ పచ్చని పంట పొలాలు, కొబ్బరి చెట్లు, పిల్లకాలువలో

ప్రవహించే గోదావరీ జలాలు, పంటపొలాలలో వాలిన తెల్లని కొంగలు, వేదికపై ధవళవస్త్రధారియైన నాన్నగారి రూపం చూడముచ్చటగా ఉంటుంది.

రమణక్షేత్రం జిన్నూరు కేంద్రంగా వెలువడే రమణభాస్కర మాసపత్రిక ద్వారా గురుదేవుల ప్రవచనాల సారంతో ఆంధ్రదేశంలో ఎందరో భక్తులకు మనోరంజకమై, మనోవికాశానికి, ఆధ్యాత్మిక సాధనకు ఉపయుక్తమౌతున్నాయి. ఆర్తితో వచ్చే ముముక్షువులు ఎలాంటి స్థితియందున్నా హృదయపూర్వకంగా శిష్యులుగా అంగీకరించడం నాన్నగారి నైజం. మహర్షి రమణులు పామరులను ఎలాంటి స్థితియందున్నా యథాస్థితిలో కరుణా పూరిత నేత్రాలతో వీక్షించి ఆదరించడం జ్ఞప్తికి తెస్తుంది,

ప్రాతఃకాలం నుండి సంధ్యాసమయం వరకూ సాగుతూండే ప్రవచనాలు భక్తులకు వీనులవిందును కల్గిస్తాయి. భక్తులకు కష్టం కలిగించే మాటలు ఎప్పుడూ వినిపించవు. సాత్వికధోరణితో సాగిపోయే ప్రసంగాలు భక్తుల హృదయాలలో నిరంతరం ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి. రమణతత్వం గురించి చెప్పినా, రామకృష్ణుని భక్తిమార్గం గురించి వివరించినా, బుద్ధుని ప్రేమతత్వం గురించి బోధించినా, కుటుంబ సంబంధాలగురించి చమత్కరించినా ఆ ప్రత్యేకతే వేరు. వినసొంపైన మాటలతో, హాస్యరసాన్ని మేళవించి, సందర్భోచితమైన వ్యాఖ్యానాలతో, హృదయానికి హత్తుకునేలా ప్రసంగాలు నదీప్రవాహంలా సాగిపోతుంటాయి.

రూపబుద్ధి, నామబుద్ధి వదలాలని, పనిని మాత్రం వదిలిపెట్టవద్దని, పిల్లల పట్ల మమకారం, కర్తృత్వభావన లేకుండా, పనిమనిషిలా బాధ్యత నిర్వర్తించాలని, అరిషడ్వర్గాలతో నిండిపోతే హృదయంలో ఈశ్వరునికి స్థానం ఉండదని... ఇటువంటి సరళమైన భాషతో చేసే ప్రవచనాలు భక్తులకు వరప్రసాదం లాంటివి.

కాలువలోని వర్షాకాలపు బురదనీటిని పటికవేసి శుద్ధిచేసినట్లుగా అరిషడ్వర్గాలతో చిక్కబడిన మనస్సులను ఆధ్యాత్మిక ప్రవచనాలతో పలుచన చేసి, భక్తులు అందరూ తరిస్తారనే భరోసానిస్తారు నాన్న గురుదేవులు. ప్రతిరోజూ వచ్చి గురుసన్నిధిలో కూర్చుని శ్రవణం, మననం చేసే భక్తులు

ఎంత ధన్యులోకదా!

పరిస్థితులు అనుకూలించినా, ప్రతికూలించినా, ప్రారబ్ధాన్ని ఇష్టంగా అనుభవించాలని, దేహంతో తాదాత్మ్యం వీడాలని, మనస్సు అంతర్ముఖం అవ్వాలని, సంపూర్ణ శరణాగతి, విచారణామార్గం ద్వారా శాశ్వత శాంతిని పొందగలమని నాన్నగారు చెప్పే మాటలు సదా ఆచరణలో పెట్టడమే భక్తుల పవిత్ర బాధ్యత కావాలి.

శిష్యరేణువుల పట్ల గురుదేవులు చూపే అత్యంత ఆదరణ, ప్రేమ, వాత్సల్యము, మమకారం, కరుణ, జాలి, సానుకూల దృక్పథం అజరామరం, అపురూపం, అద్వితీయం.

గురుసన్నిధి మధురస్మృతి. ఆయన చూపు ఓ శాంతి చిహ్నం. ఆయన పలుకు ఒక శాంతి తరంగం. జ్ఞానబోధ అమృతతుల్యం.

ఓం శ్రీ గురుభ్యో నమః



*వాచక తపస్సు, మానసిక తపస్సు అలవర్చుకోవాలి.*
*మాట ప్రియంగా, హితంగా ఉండాలి.*
*మనస్సు నిశ్చలంగా, నిర్మలంగా ఉండాలి.*

– సద్గురు శ్రీ నాన్నగారు

# గురూపదేశాలు - లోకోపమానాలు

సద్గురు శ్రీ నాన్నగారు వారి ఆధ్యాత్మిక ప్రవచనాలతో సామాన్య భక్తులకు అర్ధమయ్యే రీతిలో సరళమైన, సహజమైన వాడుక భాషలో జ్ఞాన బోధ చేస్తారు. వారి ప్రసంగాలలో వ్యక్తమైన లోకోపమానాలు కొన్ని-

- యంత్రం చెరుకుగడను ఎలా పిప్పి చేసి రసం తీస్తుందో అలా ఒక్కో జీవితాన్ని ప్రారబ్ధం పిండి పిప్పి చేస్తుంది.
- కుండకు చిల్లు ఉంటే అందులో నీళ్లు పోసినా నిలబడవు. నీ మనస్సులో శుచి లేనప్పుడు నువ్వు సాధన చేసినా అది నిలబడదు.
- శరీరాన్ని చంపేయడానికి ఒక జబ్బు చాలు. అలాగే జ్ఞానం రాకుండా ఆపుచేయడానికి ఒక్క వాసన చాలు.
- బొంగరం వేగంగా తిరిగేటపుడు అసలు తిరగడం లేదని మనకు అనిపిస్తుంది. ఆ స్పీడును మన కళ్లు పట్టుకోలేవు. జ్ఞాని చేసే పని అలాగే ఉంటుంది. అది నీ కళ్లకు కనబడదు. ఇంద్రియాలకు, బుద్ధికీ అందదు.
- వయసు వచ్చేకొలదీ శరీరం ముసలిది అవుతుంది. కానీ కోరికలు ముసలివి కావు. అవి ఇంకా గట్టిపడతాయి. కాయ పండు అయినా లోపలి గింజలు గట్టిగానే ఉంటాయి.
- మనస్సు కోతిలాంటిది. ఒక కొమ్మ మీద అది స్థిరంగా కూర్చోదు. అలాగే మన మనస్సు కూడా చంచలంగా ఉంటుంది. స్థిరంగా ఉండదు.
- గాలిని మూటకట్టవచ్చు. మనస్సుని నిగ్రహించడం కష్టం.
- గాలి లేని చోట దీపం ఎలా స్థిరంగా ఉంటుందో అలా ఈశ్వరుని పట్ల నీకు స్థిరమైన భక్తి ఉండాలి.
- మన జీవితాలు అన్నీ పూర్తయిన సినిమా వంటివి. తల్లి గర్భంలో

ఉండగానే మన సినిమా తీసేసి ఈ భూమి మీదకు వచ్చాము. ఆ సిని మాని మార్చడానికి వీలు లేదు.

- మనం బయట నుంచి లోపలకు తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్త తీసుకుంటాము. లోపల నుంచి బయటకు వచ్చే మాటల విషయంలో జాగ్రత్తపడడంలేదు. ఆలోచన లేకుండా మాట్లాడతాము.
- పాయసం త్రాగినంత ఇష్టంగా ప్రారబ్ధాన్ని అనుభవించాలి.
- పులి నోట పడ్డ మాంసపు ముక్కను మనం ఎలా బయటకు తీయలేమో అలాగే గురువు అనుగ్రహంలో పడ్డ భక్తుడు రక్షించబడతాడు. అందులో నుండి తప్పించుకునే అవకాశం లేదు.
- నది వెళ్లి సముద్రంలో ఎలా కలుస్తుందో అలా మీ మనస్సు వెళ్లి హృదయంలో లయమవ్వాలి.



*చంద్రుని నుంచి చల్లదనం, సూర్యుని నుంచి కాంతి*
*ఎంత సహజంగా ప్రసరిస్తున్నాయో అంతే సహజంగా*
*జ్ఞాని నుంచి శాంతి ప్రసరిస్తుంది. ఆనందం వర్షిస్తుంది.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# ఆత్మబంధువు

అందరికీ ఆయన ఆత్మబంధువు. ధనిక, పేద తారతమ్యాలు లేవు. కలిమిలేములనే బేధ భావన లేదు. గురువర్యులు భక్తజన బంధువే కదా! మేలిమి ఛాయతో నిండైన రూపంలో ప్రత్యేకమైన దవళవస్త్రధారణతో హిమనీ నదం వంటి చల్లనైన హృదయ స్పందనతో గురుసన్నిధి ఎంతో అపురూప మైనది. సందర్శనార్థం ఇంటికివచ్చే భక్తులు పొందే మర్యాదలకు, మన్ననలకు లోటులేదు. అందరినీ నోరార ఆప్యాయంగా పలకరించే నాన్నగారి ఔన్నత్యం ఏమని చెప్పాలి?

'ఆత్మబంధువుల్లారా!' అనే సంబోధనలోనే నాన్నగారికి శిష్యుల పట్ల ఉండే ఆత్మీయత వ్యక్తమౌతుంది. అందరినీ బాహ్య దృష్టి నుంచి మరల్చి అంతర దృష్టి వైపు నడిపించే దార్శనికుడాయన. గత జన్మలో లేనివి, మరు జన్మకు రానివి ఈ దేహగతమైన బంధుత్వాలని, అందుకే రాగద్వేషాలు విడనాడమని కర్తవ్యబోధ చేస్తారు. కర్తృత్వ భావనే దుఃఖహేతువని విశద పరుస్తారు.

పై చదువులకై వెళుతున్న విద్యార్థులకు శ్రద్ధాసక్తులతో విద్యాభ్యాసం చేయాలని, గణిత, విజ్ఞాన శాస్త్రాల పట్ల ఎక్కువ శ్రద్ధ వహించమని, అభ్యాసం చెయ్యమని కడు జాగ్రత్తలు చెప్పే ఆయన వాత్సల్యాన్ని అర్థం చేసుకోగలిగే విజ్ఞత మనకెక్కడిది?

సుదూర ప్రాంతాల నుంచి నాన్నగారి దర్శనార్థం వచ్చే వైద్యులతో ఆరోగ్య విషయాలు చర్చించడం పరిపాటి. ఆ చర్చ ఆసక్తికరంగాను, విజ్ఞాన జనితంగానూ ఉంటుంది.

ప్రారబ్ధాన్ని అనుభవించడంలో శిష్యులకు ఎలాంటి వేదనా లేకుండా గురువే తోడుంటాడని ఆయన భరోసా ఇచ్చారు. అందరి హృదయాలలో ఒక ఆత్మబంధువుగా, ఒక మార్గదర్శిగా, ఒక చైతన్య స్వరూపునిగా, సద్గురువుగా సుఖాశీనులైయున్నారు.

# ఆనందసాగరం

సద్గురు నాన్నగారి సన్నిధిలో సేదతీరడం శిష్యులకు ఎంతో పారవశ్య కరమైన సన్నివేశం. వారి ప్రతి పలుకునూ తన్మయత్వంతో ఆస్వాదిస్తారు. ఆనందసాగరంలో ఓలలాడతారు. అది ఒక శాంతి సాగరం. వారి చిరు దరహాసానికి పరవశించని వారెవ్వరు? భక్తజన బాంధవుడైన నాన్నగారి రూపం స్మరించగానే మనఃశ్శాంతిని పొందేవారెందరో. వారి చిద్విలాసం భక్తులపై పూలవాన కురిపించి, తనువులు పులకించేట్లు చేస్తుంది.

కొమ్మర గ్రామంలో బాల్యస్మృతులను వదిలి గోదావరి తీరాన క్షీరా రామలింగేశ్వరస్వామి వారి నెలవైన పాలకొల్లు పట్టణానికి సమీపంలో ప్రకృతి శోభతో అలరారే జిన్నూరు గ్రామంలో స్థిరపడి జిన్నూరు నాన్నగారిగా సుప్రసిద్ధులై శిష్యులకు ఆధ్యాత్మికత అనే పూలబాటను చూపిన మహోన్నత మూర్తి గురువర్యులు. గౌతమబుద్ధునిలో ఉండే ప్రశాంతత వారి మోములో కనిపిస్తుంది.

నాన్నగారు అనే పిలుపులో మాధుర్యాన్ని చవిచూసిన శిష్యులెందరో. తేనెలొలికే మాటలు, ప్రేమపూర్వకమైన పలకరింపులు నాన్నగారి మోములో తొణికిసలాడతాయి. మకరందాన్ని గ్రోలిన మధురానుభూతిని శిష్యులు ఆస్వాదిస్తారు. గోదావరి జలాల్లా సాగిపోయే వాక్ప్రవాహంలో హాస్యచతురత ఒక ఆకర్షణ. కుటుంబ సంబంధాలు, రాజకీయాలూ ప్రస్తావనకు వచ్చి నపుడు నాన్నగారి ఛలోక్తులు మనోరంజకంగా ఉంటాయి. విషయాన్ని శిష్యుల హృదయాలకు హత్తుకునేటట్లు చెప్పడం నాన్నగారికి నల్లేరుపై నడక లాంటిది. జనసామాన్యానికి అర్థమయ్యే లోకోపమానాలే వారి ప్రసం గంలో దొర్లుతుంటాయి.

మన హృదయంలో అంతర్యామిగా ఉన్న సద్వస్తువుకు ఎరుకలో ఉండుటయే మన గమ్యం. సద్వస్తువు ఎరుక లేకుండా ప్రపంచమంతా చుట్టివచ్చినా మనస్సుకు శాంతి ఎక్కడ? లోకంలో ఎటు పయనించినా

రాగద్వేషాలే స్వాగతిస్తాయి. మనస్సు బహిర్ముఖమైతే అశాంతి, అంతర్ముఖమైతే శాంతి అని గురుదేవులు జ్ఞానబోధ చేస్తారు. గురువు సన్నిధిలో ఊరకనుండుటయే ఉత్తమం.

జ్ఞానదానానికి మించిన దానమేమున్నది ఈ జగతిలో? నాన్నగారి నోట వెలువడిన నిరంతర బోధ జ్ఞాన సరస్సులా విస్తరించింది. ఆ సరస్సునందు స్నానమాచరించినా చాలు... శివుని జటాఝూటం నుంచి జాలువారిన పవిత్ర గంగ విశ్వనాథుని సన్నిధిలో కాశీ క్షేత్రంలో ఉత్తరవాహినిగా పయనించి, మరింత పవిత్రతను సంతరించుకుంది. నరకకూపం వైపు పయనిస్తున్న శిష్యగణం అనే ప్రవాహాన్ని గంగ దిశ మారినట్లుగా హృదయ సాగరం వైపు గమనము మార్చిన సద్గురువు ఆయనే కదా!



*గురువు జ్ఞాన ప్రదాత. గురువు అంటే ఆత్మ. గురువు అంటే శాంతి.*
*నిజమైన గురువు నీ హృదయంలోనే ఉన్నాడు.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# గోదావరివాసులు ధన్యజీవులు

గోదావరి జలాలతో ఉభయ గోదావరి జిల్లాలు పునీతమైనాయి. పరవళ్లు తొక్కి ప్రవహించే గోదావరి జలాలు కాటన్ మహాశయుని దృఢ సంకల్పంతో ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మితమై ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసాయి. తాతతండ్రుల నుంచి పట్టెడన్నం పెట్టిన కాటన్ మహాశయుని విగ్రహాలను నిర్మించి ఈ ప్రాంతవాసులు కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. గుర్రపు స్వారీ చేస్తున్న కాటన్‌దొర విగ్రహాలు పచ్చని పల్లెల్లో ఒక ప్రత్యేక ఆకర్షణ. గోదావరి తీరాన వెలసిన పుణ్యక్షేత్రాలు ఎన్నో.

పవిత్ర గోదావరీ జలాలను సేవించి, ఆధ్యాత్మికత అనే పరమాన్నం పంచిపెట్టిన నాన్నగారిని తరచుగా దర్శించుకునే అదృష్టాన్ని పొందిన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలోని భక్తులు ధన్యులు. అర్ధశతాబ్ది కాలంలో ఉభయ గోదావరి జిల్లాలలోని గ్రామాలు ఎన్నో నాన్నగారి ఆధ్యాత్మిక ప్రవచనాలతో పులకించాయి. అనేక సందర్భాలలో కాటన్ మహాశయుని కార్యదీక్షను, ఆనకట్ట నిర్మాణానికి సల్పిన కృషిని నాన్నగారు ప్రస్తావించారు.

ఆకలితో అలమటించే అన్నార్తుల కన్నీటిని తుడవడానికి గోదావరి నీళ్లను తెచ్చిన కాటన్‌దొరది మన జాతి, భాష, దేశం కానే కాదు. మానవతా వాదమే అతడిని మహనీయుడిని చేసింది. కన్నీళ్లు ఎవరు కార్చినా కష్టానికి గుర్తే అనే హృదయస్పందన మనకు కలగాలి. జాతి, కుల, మతాలకు అతీతమైనది మానవతా వాదం. కాటన్ దొర కృషిని ప్రస్తావించడం ద్వారా కృతజ్ఞత విలువను చెప్పకనే చెప్పారు నాన్నగారు.

కర్మఫలాలను అనుభవించడానికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, దేహయాత్రకు కావలసిన విషయ జ్ఞానాన్ని నేర్పిన గురువులకు, అంతకంటే మిన్నగా ఈతిబాధల నుండి ఉపశమనాన్ని కల్గిస్తున్న, అజ్ఞానమనే ఆకలిని తీర్చడానికి జ్ఞానఫలాలను అందిస్తున్న, ఆధ్యాత్మికత అనే పరమాన్నాన్ని

పంచిపెడుతున్న సద్గురు శ్రీ నాన్నగారికి మనం ఇంకెంతగా కృతజ్ఞులమై ఉండవలెనో కదా!

ఈ సృష్టి అంతా భగవత్ప్రసాదమే అయినపుడు నాది, నేను అని చెప్పుకోవడానికి ఏమున్నది? అంతా ఈశ్వరార్పణ చేసి, కృతజ్ఞులమై మిన్నకుండుట తప్ప మనం చేయగలిగినది ఏమున్నది?



*భక్తి నీకు, భగవంతునికి సంబంధించినది. సమాజం కోసం కాదు. భక్తి లోతుగా ఉండాలి, గంభీరంగా ఉండాలి, గోప్యంగా ఉండాలి.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# గురుపౌర్ణమి

గురుపౌర్ణమి రోజు జిన్నూరులో పండుగ వాతావరణం కన్పిస్తుంది. ప్రాతఃకాలం నుండి నాన్నగారి సందర్శనకు వచ్చే భక్తులతో నాన్నగారి ఇంటి పరిసరాలు నిండిపోతాయి. దూరప్రాంతాల నుంచి ముందు రోజు వచ్చి రమణక్షేత్రంలో బసచేసే వారెందరో. వీధులన్నీ భక్తుల రాకతో సందడిగా ఉంటాయి. ఇంటి ఎదురుగా ఉన్న షెడ్డులో నిరీక్షించేవారు కొందరు... చేతిలో పండ్లు పట్టుకుని క్యూలో నిలబడి నిరీక్షించే వారెందరో. సంక్రాంతికి అన్ని పల్లెల్లో కన్పించే పండుగ వాతావరణం గురుపౌర్ణమి రోజు జిన్నూరులో కన్పిస్తుంది.

ప్రతి సంవత్సరం గురుపౌర్ణమిరోజు పుణ్యదంపతులు ఉదయం నాన్నగారికి పాదపూజ చేసుకుంటారు. పాదపూజను వీక్షించాలని శిష్యులు తపిస్తుంటారు. పళ్లెంలో నాన్నగారి పవిత్ర పాదాలను ఉంచి, శుద్ధజలాలతో కడిగి, మెత్తని తెల్లని వస్త్రాలతో పాదాలను తుడుస్తారు. కుంకుమ, గంధం బొట్లు పెట్టి, వివిధ రకాల తాజా పూలతో పూజచేసి, మెడలో తులసీదళం మరియు పుష్పమాలాలంకరణ చేసి శిరస్సుపై పూలకిరీటధారణ చేస్తారు. పాదపూజ చేసిన పవిత్ర జలాలను శిరస్సుపై జల్లుకుని భక్తిపూర్వకంగా ప్రణమిల్లి, పండ్లు సమర్పించి, ఆశీర్వచనాలు తీసుకుని ఎంతో మానసికోల్లాసాన్ని చవిచూస్తారు ఆ దంపతులు. ఇది ఎంతో మనోహరమైన సన్నివేశం. వీలైనంత దగ్గర నుండి ఈ క్రతువు చూడాలని శిష్యులందరూ తాపత్రయపడుతుంటారు.

పాదపూజ అనంతరం శిష్యులు ఒక్కొక్కరుగా నాన్నగారి దర్శనం చేసుకుని, పండ్లు ఇచ్చి ఆశీర్వచనం, ప్రసాదం తీసుకుని ఆనందపారవశ్యులవుతారు. నాన్నగారు విశ్రాంతికి వెళ్లేవరకూ అక్కడక్కడే తిరుగుతూ భక్తులు తర్వాత రమణక్షేత్రానికి వెళతారు. అక్కడ భోజన ఏర్పాట్లు ఉంటాయి. భోజనానంతరం భక్తులు ఉపన్యాస వేదిక వద్దకు చేరి, వేదికకు దగ్గర్లో

కూర్చోవడానికి తాపత్రయపడతారు. మధ్యాహ్నం నాన్నగారి ఉపన్యాసం ఉంటుంది.

రమణక్షేత్రంలో మధ్యాహ్నం 2 గంటలకు నాన్నగారి ప్రసంగం ప్రారంభమై సుమారు రెండున్నర గంటల పాటు అనర్గళంగా సాగిపోతుంది. వేదవ్యాసుని జన్మదినం వ్యాసపూర్ణిమగా, గురుపౌర్ణమిగా జరుపుకుంటారు. ఆ రోజు ఎవరి గురువుని వారు ఆరాధించి, ఆశీస్సులు తీసుకోవడం సాంప్ర దాయం.

గురు సన్నిధి ఎప్పుడూ ప్రత్యేకమే. ఈ సన్నిధి మానసిన ప్రశాంతతను ఆస్వాదించడానికి ఆలంబన. గురువు పట్ల భక్తి భావాన్ని దృఢపర్చు కోవడా నికి; మనోక్లేశాలను విడనాడి, హృదయశాంతిని బడయడానికి, సంశయా లను నివృత్తి చేసుకుని అమావాస్య చీకటి వంటి అజ్ఞానాంధకారం నుండి జ్ఞానమనే పున్నమి వెలుగురేఖల వైపు పయనించడానికి ఈ గురుపౌర్ణమి వేదిక కాగలదు. తోటి శిష్యుల సజ్జనసాంగత్యం, సద్గురు ఆశీస్సులతో పునరుత్తేజం పొందడానికి ఇది ఎంతో శుభప్రదమైన రోజు.



వైరాగ్యము కూడా సంపదతో సమానము.
వైరాగ్యము లేనివాడికి ఆధ్యాత్మిక స్పృహ ఉండదు
– సద్గురు శ్రీ నాన్నగారు

# నాన్నగారు - అరుణాచలం

సద్గురు నాన్నగారితో అరుణాచల సందర్శన శిష్యులకు ఒక మరపు రాని మధురానుభూతి. నాన్నగారి ప్రయాణం నిర్ధారణ కాగానే ఆంధ్రదేశం నుండి ముఖ్యంగా హైదరాబాద్, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లా వాసులు అరుణాచలం వైపు పయనమవడానికి సంసిద్ధులవుతారు.

నాన్నగారు అరుణాచలంలోని నాన్నగారి ఆశ్రమంలో విడిదిచేయడం పరిపాటి. శిష్యులు అవకాశాన్ని బట్టి నాన్నగారి ఆశ్రమంలోనో, ఆంధ్రా శ్రమంలోనో, శివసన్నిధి లేదా నాన్నగారి ఆశ్రమానికి సమీపంలో ఉన్న ప్రైవేటు అతిథిగృహాలు బాడుగకు తీసుకుని అక్కడ వసతి సౌకర్యం పొందు తారు. అక్కడి నుంచి నాన్నగారి ఆశ్రమానికి ప్రాతఃకాలంలోనే చేరు కుంటారు.

భక్తులు రమణాశ్రమాన్ని సందర్శించి, ప్రాతఃకాలంలోనో, సాయం సంధ్యాసమయంలోనో గిరిప్రదక్షిణకు వెళతారు. అక్కడ ఉన్న నాలుగు రోజుల్లో రెండు-మూడు పర్యాయాలు గిరిప్రదక్షిణ చేసేవారెందరో. అరుణగిరి ప్రదక్షిణ ఎంతో ప్రాశస్త్యమైనది. పరమశివుడు అగ్నిలింగంగా వెలసిన గొప్ప పుణ్యక్షేత్రం అరుణాచలం.

అరుణాచలాన్ని స్మరిస్తేనే ముక్తి అని నాన్నగారు ఉద్బోధిస్తారు. అరుణ గిరి ప్రదక్షిణ చేయమని భగవాన్ రమణులు ఆశ్రమ సందర్శకులను ప్రోత్స హించేవారు. అరుణాచలేశ్వరుని ఆలయం, భగవాన్ రమణులు నివసించిన స్కందాశ్రమం, విరూపాక్షగుహ, పర్వతపాదాల వద్ద నున్న రమణుల సమాధి, రమణాశ్రమం, మాతృభూతేశ్వర ఆలయం అక్కడ ఉన్న దర్శనీయ, పరమ పవిత్ర ప్రదేశాలు.

గిరిప్రదక్షిణ 14 కి.మీ. నిడివి కలిగి, సుమారు 4 గంటల సమయం పడుతుంది. మార్గమధ్యంలో అష్టదిక్పాలకులు ప్రతిష్ఠించిన శివలింగాలు

దర్శనమిస్తాయి. రమణాశ్రమం నుంచి గిరిప్రదర్శన ప్రారంభిస్తే వరుసగా యమలింగం, నైరుతిలింగం, సూర్యలింగం, వరుణలింగం, వాయులింగం, కుబేరలింగం, ఈశాన్యలింగం, ఇంద్రలింగం దర్శనమిస్తాయి.

రహదారికి ఎడమవైపుగా ప్రశాంతచిత్తంతో అరుణాచలేశ్వరుని స్మరిస్తూ ప్రదక్షిణ చేయాలి. గర్భిణీ స్త్రీ నడకవలె ఉంటే మంచిది. లౌకిక విషయాల ప్రస్తావన తేరాదు. గిరి మనకు కుడివైపున దూరంగా కన్పిస్తూ ఉంటుంది. రహదారికి కుడివైపునుంచి సిద్ధపురుషులు వస్తారని విశ్వాసం. రమణాశ్రమం వైపునున్న గిరిభాగం అమ్మవారి స్వరూపమని, వెనుక వైపు నున్న భాగం ఈశ్వర స్వరూపమని విశ్వసిస్తారు. పరమేశ్వరుడు ఇక్కడ అర్ధనారీశ్వర రూపం ధరించినట్లు పురాణ ప్రసిద్ధి.

భగవాన్ బ్రిడ్జి దగ్గరికి వచ్చేటప్పటికి గిరి ప్రదక్షిణలో సగం దూరం పూర్తయినట్లు. గిరి ప్రదక్షిణ సమయంలో భగవాన్ ఆ బ్రిడ్జిపై కూర్చుని, గిరిని తదేక దీక్షతో వీక్షించేవారట.

గిరి ప్రదక్షిణలో ప్రధాన ఆలయంలో అరుణాచలేశ్వరుని, అపిత కుచాంబ అమ్మవారిని దర్శించుకుని, భక్తులు పారవశ్యం పొందుతారు. ఎత్తయిన రాజగోపురాలతో, ప్రాకారంతో, విశాలమైన ప్రాంగణంలో కొలు వైన గొప్ప దేవాలయమిది. వేంకటరామన్ అరుణాచలమేతెంచిన తొలి నాళ్లలో బాహ్య స్పృహలేక, సమాధి స్థితినొందిన పాతాళలింగం ఈ ఆలయ ప్రాంగణం లోనిదే.

రమణులు తరచుగా గిరిప్రదక్షిణ చేసేవారు. నాన్నగారు ఎన్నో పర్యా యాలు శిష్యులతో కలిసి గిరిప్రదక్షిణ చేయడం శిష్యుల పూర్వజన్మ ఫలం. గిరిప్రదక్షిణలో గిరిశిఖరం పైనగల శివకుటుంబ దర్శనం శుభప్రదం. ఆర్తు లకు గిరి ఎన్నో రూపాలలో గోచరిస్తుంది.

దీపోత్సవం రోజు రమణాశ్రమంలోను, నాన్నగారి ఆశ్రమం వద్ద ఎంతో శోభాయమానంగా ఉంటుంది. కృత్తికా పౌర్ణమిరోజు లక్షలాదిమంది

గిరిప్రదక్షిణ చేస్తారు. దీపోత్సవం రోజు నాన్నగారి సమక్షంలో నాన్నగారి ఆశ్రమంలో ఉండడం భక్తులకెంతో ఆనందదాయకం. ఎక్కడ వసతి పొందినా నిద్రాసమయం తప్పించి శిష్యులు గడిపేది నాన్నగారి ఆశ్రమంలోనే.

నాన్నగారితో ఎక్కువ సమయం ఉండాలనేది శిష్యుల తాపత్రయం. ఆ అనుబంధం అలాంటిది. నాన్నగారి ఆశ్రమ ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటుచేసి, ఉపన్యాసం వినడానికి వచ్చే భక్తులకు సదుపాయం కల్పిస్తారు. భోజన వసతి ఉంటుంది. ఆ రోజు ప్రాంగణాన్ని ముగ్గులతో అలంకరిస్తారు. సాయం సంధ్య వేళ నాన్నగారి చుట్టూ కూర్చుని భక్తులు పొందే ఆనందం మాటలతో చెప్పనలవికాదు.

అరుణగిరిశిఖరంపై దీపోత్సవం జరిగిన వెంటనే నాన్నగారి ఆశ్రమం లో పుణ్యదంపతులతో జ్యోతిప్రజ్వలన జరిపిస్తారు. నాన్నగారు అరుణగిరి వంక తదేక దృష్టితో చూసి, నమస్కరించి సుఖాశీనులవుతారు. భక్తులు తన్మయత్వంతో అరుణగిరి వైపు తిరిగి ప్రణమిల్లి నాన్నగారి ఆశ్రమంలో జ్యోతికి నమస్కరించి ప్రదక్షిణ చెయ్యడం ఒక మధురానుభూతి. ఆ సాయం సంధ్య వేళ నాన్నగారి సమక్షంలో జరిగే ఉత్సవంలో పాల్గొనడం ఎంత పుణ్యఫలమో కదా!

నాన్నగారు రమణాశ్రమాన్ని సందర్శించినపుడు భక్తులు వారి వెన్నంటే ఉంటారు. నాన్నగారు రమణాశ్రమాన్ని, మాతృభూతేశ్వరాలయాన్నీ సందర్శి స్తారు. ఆ ప్రాంగణంలో గల పుస్తక విక్రయకేంద్రంలోని ఆధ్యాత్మిక గ్రంథా లను తీసుకుని, జిన్నూరు వచ్చే శిష్యులకు కానుకగా ఇస్తుంటారు.



*మనస్సు ఇంద్రియాలతో కలిస్తే భోగి, మనస్సు ఆత్మలో కలిస్తే యోగి.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# రమణక్షేత్రం - జిన్నూరు

జిన్నూరులో రమణక్షేత్రం స్థాపనలోను, నిర్వహణలోనూ నాన్నగారి ఆశీస్సులతో రమణ భక్తులు సల్పిన కృషి ప్రశంసనీయం. జిన్నూరు గ్రామంలో శివారు పంటపొలాల మధ్య రమణక్షేత్రం నిర్మితమైంది. చుట్టూ పచ్చని పంటపొలాలు, కొబ్బరిచెట్లు, చెరువులు, గోదావరి జలాలు ప్రవహించే పిల్లకాలువలతో ఆహ్లాదకరమైన వాతావరణం కన్పిస్తుంది.

నాన్నగారి దర్శనార్థం వచ్చే దూరప్రాంతవాసులు ఇక్కడ వసతి పొందడానికి వసతి గదులు నిర్మితమయ్యాయి. ఉచిత భోజన వసతి కల్పిస్తారు. విశాలమైన హాలులో గోడపై భగవాన్ రమణుల చిత్రపటం నయనానందకరంగా ఉంటుంది. ప్రవేశద్వారం వద్ద భగవాన్ విగ్రహం నిర్మలమైన చూపుతో దర్శనమిస్తుంది.

రమణక్షేత్రంలో గల కొబ్బరితోటలో ఒకప్రక్క అరుణగిరి ఆకృతి నిర్మితమైంది. ప్రత్యేకమైన పర్వదినాలలో ముఖ్యంగా గురుపూర్ణిమ, రమణ జయంతి, నాన్నగారి పుట్టినరోజు, దీపోత్సవం వంటి వేడుకలు ఈ ప్రాంగణంలో నిర్వహిస్తారు. కొబ్బరితోటలో షామియానాలు వేసి వేదికను ఏర్పాటు చేస్తారు. వేదికపై పుష్పాలంకరణ చేస్తారు. ప్రవేశద్వారాన్ని గెలలతో ఉన్న అరటిచెట్లతో అలంకరిస్తారు. సుమారు ఐదువేల మంది భక్తులు వచ్చినా ఉపన్యాసాలు వినడానికి ఇక్కడ సౌకర్యంగా ఉంటుంది.

శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఈ రమణక్షేత్రంలో ఏర్పాట్లు ఉంటాయి. పేద విద్యార్థులకు చేయూత నివ్వడంలో నాన్నగారి చేతికి ఎముక లేనట్లే వ్యవహరిస్తారు. ఆయన సేవానిరతి అసామాన్యం. పేదల పెళ్లిళ్లకు ధనసహాయం చేసిన సందర్భాలెన్నో. కళ్యాణమండపం నిర్మాణానికి, సంక్షేమ భవనాల నిర్మాణానికి తగిన ఆర్థిక సాయం అందిస్తారు.

రమణక్షేత్రం ద్వారా నిర్వహించబడే రమణభాస్కర మాసపత్రిక ద్వారా

నాన్నగారి ఆధ్యాత్మిక ప్రవచనాలు భక్తుల చెంతకు చేరతాయి. సామాన్య భక్తులకు అర్ధమయ్యే సరళమైన భాషలో ముద్రించబడి, వారి ఆధ్యాత్మిక సాధనకు ఉపయుక్తమవుతున్నాయి. వివిధ గ్రామాలలో నిర్వహించబడుతున్న రమణ సత్సంగాలలో రమణభాస్కరలో ముద్రితమైన నాన్నగారి ఉపన్యాసాల సారాన్ని మననం చేసుకుంటారు. ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను పఠించడం జరుగుతుంది.



*గాఢ నిద్రలోని సుఖం, జాగ్రదావస్థలోని ఎరుక – ఈ రెండూ ఒకేసారి అనుభవంలోకి వస్తే మోక్షాన్ని పొందుతాము.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# శుభకార్యాలు

ఏ శుభకార్యం జరిగినా శిష్యులు నాన్నగారికి చెప్పి, ఆశీస్సులు తీసుకోవడం పరిపాటి. గృహప్రవేశం కావచ్చు, వివాహ మహోత్సవం కావచ్చు, పుట్టినరోజు, అన్నప్రాశన, కొత్త వ్యాపారం కావచ్చు... అన్ని శుభకార్యాలనూ నాన్నగారి ఆశీస్సులతోనే ప్రారంభిస్తారు.

భక్తుల ఇళ్లలో ఎన్నో శుభకార్యాలకు నాన్నగారు స్వయంగా హాజరై ఆశీర్వచనాలు ఇవ్వడం శుభప్రదం. ఏ శుభకార్యానికి వెళ్లినా నూతనవస్త్రాలు, ఏదో ఒక బహుమతి తీసుకువెళ్లి వారికి కానుకగా ఇవ్వడం శిష్యులకు ఎంతో సంభ్రమాశ్చర్యాలను, ఆనందాన్నీ కలిగిస్తాయి. నాన్నగారు ఆశీస్సు లందించిన ఆ వేడుకలు శిష్యులకు ఎంతో ఆనంద పారవశ్యాన్ని అందిస్తా యనడం ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు.

అందరూ స్వంత ఇంటిని నిర్మించుకోవాలని, దానిలో నివశించాలనీ కోరుకుంటారు. ఎన్ని అద్దె కొంపలు మారినా సంతోషం కలగదు. ఆ ఇంటి యజమాని తమను ఎప్పుడు ఖాళీ చేయమంటారోనని చింత. గురువర్యులు శరీరాన్ని అద్దె కొంపగా వర్ణించేవారు. స్వంత ఇంటికోసం కలలు కనే మనం స్వగృహమైన హృదయంలోనికి గృహప్రవేశం చేయడానికి సంకోచమెందుకు? ఈ మాయ ఏమిటో మనకు అర్థం కావడం లేదు.

గురువుతో ఏర్పడిన మానసిక అనుబంధమే అనుగ్రహ ప్రసాదంగా వ్యక్తమై హృదయమనే స్వగృహ ప్రవేశం చేయిస్తుంది. దీనికన్నా శుభ కార్యమేమున్నది ఈ లోకంలో?

సాధన అణువంతైనప్పటికీ గురువు అనుగ్రహం అనంతమై మహా ప్రవాహంగా ఉవ్వెత్తున ఎగసి పడుతుంది. ఎన్ని వాసనలైనా ఆ ప్రవాహంలో కొట్టుకుపోవలసిందే. ఆ అనుగ్రహం అవ్యక్తం. కంటికి కనబడదు, మనసుకు అందదు.

# శిష్యులు - యోగక్షేమాలు

శిష్యుల యోగక్షేమాలు విచారించడంలో నాన్నగారి శైలియే వేరు. ఆ పలకరింపులో హృదయాంతరాల నుండి ఉప్పొంగే వాత్సల్యం వ్యక్తమౌ తుంది. శిష్యుల గురించి, వారి కుటుంబ సభ్యులు, బంధువుల యోగక్షేమాల గురించీ పేరుపేరునా అడిగే పలకరింపులో అపారమైన ప్రేమ దాగి యుంటుంది. ఆ జ్ఞాపకశక్తి ఆశ్చర్యం కలిగిస్తుంది.

సాగరతీరం విశాఖవాసులు నాన్నగారి రాక కోసం నిరీక్షిస్తూ ఉండే వారు. ఆ నిరీక్షణలో శిష్యులలో ఎంతో తపన వ్యక్తమయ్యేది. ప్రతి సంవత్స రం రెండు, మూడు పర్యాయాలు నాన్నగారు విశాఖ సందర్శించేవారు. అలాగే నాన్నగారి పుట్టినరోజు వేడుకలు హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీలో సత్యసాయి కళ్యాణమండపంలో ఎన్నో సంవత్సరాలు నిర్వహించారు. ఈ వేడుక కోసం శిష్యులు, భాగ్యజీవులైన భాగ్యనగరవాసులు ఎంతగానే పరి తపిస్తూ వుంటారు.

నాన్నగారిని దర్శించుకోవాలనే తపన శిష్యులలో ఏ విధంగా వ్యక్త మౌతుందో అంతకంటే అధికంగా శిష్యులను చూడాలనే వాత్సల్యం నాన్నగారి హృదయంలో ఉంటుంది. అనిర్వచనీయమైన ఈ బంధాన్ని, అనుభూతిని వ్యక్తంచేయడానికి ఏ భాషలో అక్షరాలు సరిపోతాయి? మౌనభాష తప్ప.

నాన్నగారి పుట్టినరోజు కావచ్చు, రమణ జయంతి కావచ్చు, దీపో త్సవం కావచ్చు, గురుపౌర్ణమి కావచ్చు... వేడుక ఏదైనా, మిగతారోజులలో అయినా సరే నాన్నగారి దర్శనార్థం వచ్చే భక్తులు పుట్టింటికి వచ్చినట్లు అనుభూతి పొందుతారు. ఆ స్వచ్ఛమైన ఆదరాభిమానాలు, మమతాను రాగాలు దొరికేది నాన్నగారి సమక్షంలోకాక మరెక్కడ? దూరప్రాంత భక్తులకు విశ్రాంతి గురించి, వసతి, భోజన సదుపాయాల గురించీ శ్రద్ధవహించడం నాన్నగారి ప్రేమతత్వానికి ప్రతీక.

# ఈతిబాధలు

శిష్యులు నాన్నగారిని కలిసినపుడు శరీర రుగ్మతలు చెప్పుకోవడం జరుగుతూ ఉండేది. వారి కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యల గురించి ఏకాంతంగా కలిసి ఏకరువు పెట్టుకుంటారు. అనారోగ్య సమస్య ఏదైనా ఫలానా ఆసుపత్రిలో చూపిస్తామని నాన్నగారికి తెలియజేసి, దుఃఖం నుండి ఉపశమనం పొందుతారు. ఆ విధంగా చెయ్యండి తగ్గిపోతుంది అని నాన్న గారు చెబితే మనస్సు తేలికపడుతుంది. అదొక సంతోషం. దూరప్రాంతాల నుండి చరవాణి ద్వారా మాట్లాడేవారు కొందరు. ఊరటనిచ్చే మాటలు నాన్నగారి నోటి నుంచి చరవాణిలోనైనా వినడం వారికెంతో మనోధైర్యా న్నిస్తుంది.

కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, మనస్పర్థలు, వ్యాపారంలో వచ్చే నష్టాలు, ఉద్యోగ సమస్యలు... ఒకటనేమిటి? ఎన్నోరకాల సమస్యలు నాన్నగారికి చెప్పుకోవడం, సలహాలు, ఆశీస్సులు తీసుకోవడం, తరుణో పాయం తెలుసుకుని మనఃశాంతిని పొందడం నిత్యకృత్యాలే. ఉదయం నుండి సాయంత్రం వరకు ఏ సమయంలోనైనా సమస్యలు చెప్పుకునే చనువు నాన్నగారి దగ్గర ఉండేది.

ఎవరి కుటుంబ సమస్యయైనా తన స్వంత సమస్యగా భావించే విశాల హృదయం నాన్నగారి స్వంతం. శిష్యులందరిదీ ఒకే కుటుంబంగా భావిస్తారు. బేధభావన లేనేలేదు. కలిమి లేమి అనే తేడా అసలే లేదు. ఆసుపత్రికి సైతం వెళ్లి, చికిత్స పొందుతున్న శిష్యుల యోగక్షేమాలు విచారించిన సందర్భాలెన్నో.

డాక్టర్లు చేసే వైద్యం కన్నా నాన్నగారి మాటలే వారికి అమృతతుల్యమై జీవం పోసేవనుట అక్షర సత్యం. రోగులకు మనోధైర్యాన్ని మించిన మందే ముంది? రోగుల పాలిట వైద్యునిలా, కుటుంబ సమస్యల పరిష్కారంలో

కుటుంబ పెద్దలా వ్యవహరిస్తారు. లోకజ్ఞానం ఉంటేనే ఇతరుల మోసాలకు గురికాకుండా ఉండగలరని చెప్పే ఆయనలో ఒక స్నేహితుడు కన్పిస్తాడు. ఇలా ఎన్నో రూపాలు ఆయనలో వ్యక్తమవుతాయి. కష్టాలు కలకాలం ఉండవని, లోచూపు అలవర్చుకుంటే మనశ్శాంతి కలుగుతుందని, అపుడే ఆనందంగా, శాంతిగా ఉండగలరని ఆయన హితబోధ చేస్తారు.



*అన్నివేళలా అంతటా నిండి ఉన్న సృష్టికర్త జీవులందరినీ*
*వారివారి ప్రారబ్ధానుసారం ఆడిస్తూ ఉంటాడు.*
*ఎవరు ఎంతగా ప్రయత్నించినా జరుగనిది జరుగనే జరుగదు.*
*ఎవరు ఎంతగా అడ్డుపడినా జరిగేది జరుగక మానదు.*
*ఇది సత్యము, తథ్యము. అందుచేత మౌనమే శరణ్యము.*

*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# హృదయవాసి

శిష్యరేణువుల హృదయాలలో నీవు వశించినావు. తరతమ బేధం లేని ఆ బంధం ఎంత బలీయమైనదో కదా! బోసినోటితో నీ చెంతకు చేరిన చిన్నారుల నుండి దంతాలూడిన వృద్ధుల వరకూ వయోబేధం లేని నీ ఆత్మీయపు పలకరింపులకు పులకరించినవారే.

ఆర్తుల సుఖదుఃఖాలను వారి హృదయవాసివై వీక్షిస్తూనే ఉన్నావు. కన్నీటి కడలిలో ఈదులాడే దీనులకు దిక్సూచిలా నిలిచినావు. స్త్రీ పురుష బేధం లేదు. వర్ణ వ్యత్యాసం లేదు. ఏకత్వమే కాని ద్వైతభావన లేదు.

భానుడుదయించకముందే నీ వాత్సల్యపూరిత వాక్కులు వినంగ తపించే ఆర్తులెందరో! నీ వీధి గుమ్మం చెంత వేగిరపడి వేచి చూసే వారెం దరో! సమయపాలన లేని సందర్శకులకు కాలమే ఈర్ష్యపడేట్లు సమయమిచ్చి నావు. నీవు హృదయవాసివేననే తెలివిలేని అజ్ఞానులమైనాము. ముందు వరుస జాగాకై ముచ్చటపడినాము.

జనుల దాహార్తిని తీర్చంగ ఎన్నో ఓషదులను లయము చేసుకుని ప్రవహించే గంగమ్మ తల్లిలా మా అజ్ఞానమనే దాహార్తిని తీర్చంగ దివి నుండి భువికి దిగివచ్చిన జ్ఞానప్రవాహము నీవు. ఓర్పు, సహనం, ప్రేమ, వాత్సల్యం, ఆదరణ, మమకారం, కరుణ, అనురాగం, శాంతి, చిరు దర హాసం, నిరాడంబరత, సత్యాన్వేషణ వంటి ఎన్నో ఓషధులను నీ వెంట తెచ్చినావు.

నీ చేతిలో కాయో, పండో పెట్టి నిన్ను ఏమార్చి మా మిడిమిడి జ్ఞానాన్ని ప్రదర్శించ పోటీపడినాము. నీ చేతనున్న ఏ యాపిల్ పండునో తిరిగి ఇంటికి తీసుకుని వెళ్లంగ తపనపడినాము. నీ చెంతనున్న జ్ఞాన ఫలాలను స్వీకరించాలనే తెలివి లేనివారమైనాము. ఎన్నో ఓషధులను నీ నుండి పొందాలనే అభిలాష లేని మందమతులైనాము. అమృత భాండా గారము మా చెంతనున్నా దానిని గ్రోలంగ తపనలేనివారమైనాము.

# జ్ఞాననేత్రాలు

శిష్యులందరినీ ఆప్యాయంగా పలకరించే ఆ ప్రేమైకమూర్తి ఋణం ఏ విధంగా తీర్చుకోగలం? గౌతమబుద్ధుని నేత్రాలలో ఉండే ఆ తేజస్సు నాన్నగారి నేత్రాలలో కాంచినారము. ఆ నేత్రాలు శాంతి చిహ్నాలు. ఎడారిలో పయనించే బాటసారికి ఒయాసిస్సు (చిన్న నీటికొలను) ఎంత సుఖప్రదమో, మండుటెండలో నడిచే పాదచారికి చెట్టు నీడన సేదతీరడం ఎంత ఆహ్లాద కరమో, దుఃఖభరితమైన సంసారమనే కొలిమి నుండి నాన్న సన్నిధికి చేరిన శిష్యులకు ఆ సాన్నిధ్యం అంతకంటే మిన్నయైన ఉపశమనం.

ఆ చల్లని చూపులో ఏ అద్వితీయ శక్తియున్నదో కదా! ఆత్మీయపు పలకరింపులు, కష్టాల నుండి ఊరటనిచ్చే ఆ భరోసా, పుట్టింటి ప్రేమ, వాత్సల్యం, కారుణ్యం... అన్నీ ఆ కళ్లలోనే కదలాడుతాయి. మౌనంగా చూసే ఆ చూపులకు చిరుదరహాసం తోడై ఆ ముఖారవిందాన్ని చూడగానే ఏమి ప్రశాంతతయో కదా!

అవి జ్ఞాననేత్రాలు. అంతర దృష్టిహీనులమైన మాకు ఆ తేజస్సును చూసే శక్తి లేదు. శిష్యుల స్థాయికి దిగివచ్చి చెప్పే ఆ మాటలలో లౌకిక విషయాలను ఆసక్తిగా ఆలకించాముగాని, వాటి వెనుక నుండే సూక్ష్మం, మర్మం గ్రహించలేని తెలివిహీనులమైనాము.



*'నేనెవరు?' అని ఆత్మ విచారణ చేయి. లేదా శరణాగతి చెందు.*

*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# నాన్న-బిడ్డల అనుబంధం

నాన్నగారు అనే పిలుపులోనే ఏదో అనిర్వచనీయమైన అనుభూతిని బిడ్డలు ఆస్వాదిస్తారు. అంత ప్రేమతత్వాన్ని తనలో దాచుకున్న తండ్రిని లోకంలో ఎక్కడా కానరాము. దశాబ్దాలుగా అదే ప్రేమను వేలాదిమంది శిష్యులకు పంచిపెట్టారు. హృదయంలో అంతర్యామిగా ఆ ప్రేమామృతాన్ని పంచుతూనే ఉంటారు. అదెలా సాధ్యమో ఆ తండ్రికే ఎరుక. విసుగు, విరామం లేదు, అలసట లేదు. కోపపు ఛాయలు మచ్చుకైనా కానరావు.

ఆ కళ్లల్లో ప్రేమ తొణికిసలాడుతుంది. ఆ పెదవులపై వాత్సల్యం నాట్యమాడుతుంటుంది. అమృతహస్తాలతో మమకారాన్ని రంగరించి, ఇచ్చే ప్రసాదం స్వీకరించడం భక్తులకు తియ్యటి అనుభూతి.

అది జనసామాన్యానికి సాధారణంగా కన్పించే ఇల్లుకాదు. అది ఒక శాంతినిలయం. ప్రేమసౌధం. ఆడబిడ్డ పుట్టినింటికి వచ్చినపుడు ఎన్నెన్నో ఊసులు తన తల్లికి చెప్పుకుంటుంది. తన మనస్సులోనున్న వేదనను తల్లికి బదిలీ చేసి ప్రశాంత చిత్తంతో తల్లి ఒడిలో సేదతీరుతుంది.

నాన్నగారి బిడ్డలు పుట్టింటికి వచ్చినపుడు తండ్రికి చెప్పుకోవడం పరిపాటి. ఇది అందరికీ పుట్టినిల్లే. తల్లైనా, తండ్రైనా ఆయనే. ఆ చనువు, ఆ స్వేచ్ఛ అందరికీ ఇక్కడ ఉంది. కొంచెం నలతగా ఉన్నా కూడా ప్రతి రోజూ బిడ్డలకు కొంత సమయం కేటాయించవలసిందే. లేకపోతే బిడ్డలు మనోవ్యథ చెందుతారు.

శిష్యులందరూ నాన్నగారి బిడ్డలే కదా! ఆ ఊసులన్నీ నాన్నగారికి చెప్పుకోవలసిందే. దర్శనం లేని రోజు ఏదో దిగులు, ఆవేదన. బిడ్డలను చూడకుండా ఆ తండ్రి మాత్రం ఉండగలరా ఏమిటి? అదొక మానసిక అనుబంధం. జన్మాంతరాల బంధం. ఉచితంగా దొరికే ఆ ప్రేమ ఫలాన్ని ఎవరు మాత్రం వదులుకోగలరు?

నాన్న తన సన్నిధికి వచ్చే శిష్యులనే కాదు... వారి బంధుగణం యోగక్షేమాలు కూడా పేరుపేరునా అడగడంలో ఎంతో వాత్సల్యం పొంగిపొర్లుతుంది. మన మధ్యన నడయాడే మహోన్నతమూర్తి వైభవాన్ని ఆస్వాదించలేని అవివేకులమైనాము. లౌకికమైన విషయాలకే పరిమితమై నాము. మంచుపొరల మాటున, మబ్బుతెరల చాటున ఉన్న జ్ఞానసూర్యుని తేజస్సును వీక్షించలేకున్నాము.



ఆత్మవిద్య తప్ప మిగిలిన విద్యలన్నీ పొట్టకు మాత్రమే పరిమితమై ఉన్నాయి. ఆత్మవిద్య మానవునికి స్వేచ్ఛను, సుఖమును, శాంతిని ప్రసాదిస్తుంది.

– సద్గురు శ్రీ నాన్నగారు

# రావిచెట్టు - చిగురుటాకులు

జిన్నూరులో నాన్నగారి ఇంటికి దర్శనార్థం రాగానే సమీపంలోనున్న కోనేరు వైపు దృష్టి మరల్చడం యథాలాపంగా జరుగుతుంది. నాన్నగారి హృదయంలా ఆ కోనేరు ప్రశాంతతకు చిహ్నం. నిశ్చలమైన, స్వచ్ఛమైన నీటితో, మృదువైన తామరాకులతో, తామరపువ్వులతో కంటికి ఇంపుగా కన్పిస్తుంది ఆ కోనేరు.

ఆ కోనేరు గట్టుపై శ్రీకృష్ణుని విగ్రహం, అటు ప్రక్కగా వింజామరలుగా ఊగిసలాడే పచ్చని చిగురుటాకులతో రావిచెట్టూ కనిపిస్తాయి. అదొక సుందర దృశ్యం. పవిత్రమైన రావిచెట్టు వైపు వీక్షిస్తే ఎన్నెన్నో జ్ఞాపకాలు. ఎన్నో శాఖోపశాఖలుగా చిగురుటాకులతో గంభీరంగా కన్పించే రావిచెట్టు మేరుపర్వతం లాంటి నాన్నగారిని జ్ఞప్తికి తెస్తుంది. వేలాదిగా ఆ రావిచెట్టుకున్న ఆకులను చూడగానే నాన్నగారిని ఆశ్రయించిన బిడ్డల్లాంటి శిష్యులను స్ఫురణకు తెస్తుంది.

ఆ రావిచెట్టుకున్న గాంభీర్యం, స్థిరత్వం చిగురుటాకులకు లేదేమి? ఈదురుగాలులకు, గాలివానలకు తట్టుకుని రావిచెట్టు గంభీరంగా, నిశ్చలంగా నిలబడినా, ఆ చెట్టునాశ్రయించిన చిగురుటాకులు చిరుగాలికి సైతం కదలాడుటయేమి?

చిరు వాసనలకు సైతం చలించే మనస్సులా రావిఆకులు కన్పిస్తు న్నాయి. రావిచెట్టునాశ్రయించిన ఆ చిరుగుటాకులకు ఆ నిశ్చలత్వం, ఆ గాంభీర్యం ఎలా వస్తుందో కదా! కొన్ని కొమ్మలు మాత్రం రావిచెట్టు లాంటి స్థిరత్వాన్ని, ధృడత్వాన్నీ అలవర్చుకున్నాయి. ఏ కదలికా లేక నిశ్చలంగా ఉ న్నాయి.

అంతరదృష్టిని అలవర్చుకుని, విచారణా మార్గం వైపు పయనించే కొద్దిపాటి శిష్యులు ఆ కొమ్మలను చూడగానే స్ఫురణకు వస్తారు.

# ఆధ్యాత్మిక బాట - మనసులో మాట

ఆధ్యాత్మికత అనే పూలబాటలో నడిచిన శిష్యులు నాన్నగారి సన్నిధిలో గడిపిన మధురక్షణాలను నెమరువేసుకోవడంలో అవ్యక్తమైన అనుభూతిని ఆస్వాదిస్తారు.

"అమ్మకూ చెప్పలేదు, నా తోబుట్టువులకూ చెప్పుకోలేదు. ఆనంద మైనా, ఆవేదననైనా ఆ తండ్రికే నివేదించాను. అశాంతిని ఆయనకిచ్చి, నేను శాంతిని పొందాను. మా ఇంట ఏ శుభకార్యమైనా ఆయన ఆశీర్వచనం తోనే". ఒక శిష్యురాలు ఆర్ద్రమైన హృదయంతో చెప్పిన మాటలివి.

'మీ అమ్మాయా?' అనే షాపువాని ప్రశ్నకు 'ఔను... మా అమ్మాయే' అని ఒక భక్తురాలి గురించి నాన్నగారు ఇచ్చిన సమాధానం ఇది. 'అల్లుడు గారు ఏమి చేస్తారు?' అనే మరో ప్రశ్నకు 'ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తారు' – నాన్నగారు సావధానంగా ఇచ్చిన సమాధానం ఇది. హద్దులు లేని ఆప్యాయతకు, అవధుల్లేని అనురాగానికి ఇదొక మచ్చు తునక. ఇది ఒక భక్తురాలి హృదయాంతరాలలో సువర్ణాక్షరాలతో లిఖించుకుని, పదిలపర్చు కున్న ఒక సంఘటన. మధురాతిమధురమైన ఇలాంటి తీపి జ్ఞాపకాలు శిష్యకోటి జీవితాలలో ఎన్నెన్నో...

అంతటి ఆత్మీయ పలకరింపు నాన్నగారి నోటినుండి కాక మరెవరి నుంచి వినగలం? అంతగా ఆదరించి ప్రేమగా పలకరించే వారెవరు ఈ లోకంలో? నాన్నగారి ఆత్మీయత అనే పుస్తకంలో తీపి పుటలు ఎన్నెన్నో... అంతేవాసులు తన్మయత్వంతో ఆస్వాదించిన క్షణాలు కోకొల్లలు.

అంత ఆత్మీయత కలబోసిన ప్రేమతత్వం ఆయనలో ఎక్కడినుంచి వచ్చి చేరిందో ఆ పెరుమాళ్లకే ఎరుక. ప్రాతఃకాలంలో ఒంటికి రాసుకునే తైలంలో ఉందా?, మధ్యాహ్నవేళలో సేవించే తేనీటిలో కలిసిందా?, కోనేటి గట్టునుంచి వీచే చల్లనిగాలి తోడ్కొని వచ్చిందా?, గోదావరి జలాల ద్వారా

అందిందా?

నాన్నగారు నడయాడిన జిన్నూరు నేలలోనే ఆ తత్వముందా?, అందరూ ఆదమరచి నిదురించిన వేళ ఆకాశం నుంచి ఆ ప్రేమజల్లు ఆయనపై మాత్రమే వర్షించిందా?, జఠరాగ్నిలోనే అంతర్లీనమైయుందా? – ఆ మర్మమేమిటో మాకెవరికీ అంతుబట్టడం లేదు.

కడుపు నిండా గోదావరి జలాలు సేవించి, జిన్నూరు నేలపై పలు మార్లు కలియతిరిగాము. ఇలాంటి సత్వగుణ సంపత్తిని కొంతైనా ఒంట పట్టించుకుందామని రెప్పవాల్చక చూస్తూనే ఉన్నాము. మాలో ఇంతటి ఆత్మీయత మచ్చుకైనా కానరాదేమి?

అరిషడ్వర్గాలనే బంధుమిత్రులను మాతో తోడ్కొని వచ్చినాము. మా మనసుకు నచ్చినట్లు నీవు నడయాడినావు. నీ మనసెరిగి మేము జీవనయాత్ర సాగించలేకపోయాము. మా అపరాధమును క్షమించలేవా? గమ్యము, గమనము ఉన్నతంగా ఉండేటట్లు మమ్ము దీవించుము తండ్రీ...



*దేహ క్రియలను బట్టి జ్ఞాని స్థితిని నిర్ణయించడానికి వీలులేదు.*
*వారి స్థితి మనకు అర్థం కావాలంటే ముందు మన స్థితి మారాలి.*
*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# జగమంతా బంధుత్వాలు - ఒంటరి జీవితాలు

'ఆత్మబంధువుల్లారా!' అనే నాన్నగారి సంబోధనలో మానవాళిది ఆత్మ బంధమే అని వ్యక్తమౌతున్నది. అంతా అద్వైతమే. ద్వైతభావన వీడాలి అనే రమణుని మాటల్లో చూసేది, చూడబడేదీ రెండు లేవు అనే భావన విశద మౌతుంది. ప్రపంచం ఉన్నట్లుగా కనబడుతోంది అనే వ్యాఖ్యలో ప్రపంచ ఉనికి భ్రాంతియే అని అర్థమౌతుంది. ప్రపంచం, జీవితం స్వప్న సమానమని తేటతెల్లమౌతోంది.

ప్రారబ్ధాన్ని అనుభవించడానికి తల్లి గర్భంలో ఒంటరిగా ప్రవేశించిన జీవుడు నవమాసాల్లో ఒక రూపాన్ని పొంది, ఒంటరిగానే ఈ జగతిలోకి ప్రవేశిస్తాడు. ప్రారబ్ధాన్ని ఒంటరిగానే అనుభవిస్తాడు. ఒంటరిగానే ఈ లోకాన్ని విడిచిపోతున్నాడు. పూర్తి వాసనాక్షయమయ్యే వరకు ఎన్నో జన్మలు ఎత్తుతూనే ఉంటాడు.

తల్లి, తండ్రి, అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు, భార్యాభర్తలు... ఇలా ఎన్నో దేహగతమైన బంధుత్వాలు ప్రారబ్ధాన్ని బట్టి ఏర్పడతాయి. స్నేహ సంబంధాలు పరిఢవిల్లుతాయి. ఇవి అన్నీ దేహగతమైన నేనుకే పరిమితం. దేహంతో పాటు వచ్చిన ఈ సంబంధాలు దేహయాత్రతో పాటు ముగిసి పోతాయి.

గత జన్మలో ఈ బంధాలు లేవు. మరుజన్మకు రావు. ఈ నగ్నసత్యాన్ని నాన్నగారు స్ఫురణకు తెస్తూనే ఉంటారు. కానీ అరిషడ్వర్గాల విషవలయంలో జీవుడు బంధీయైయున్నాడు. మంచుపొరల మాటున దాగిన వెలుగురేఖలు చూడలేకున్నాడు. అహంకార, మమకారాలే సంసారమని విజ్ఞుల మాట.

అంతరదృష్టి బలపడిన కొలదీ లోకవాసనలు, ద్వైతభావనలూ పలుచబడతాయి. జపమాచరించినా, సాధన చేసినా, విచారణ చేసినా,

శరణా గతి పొందినా, నిష్కామకర్మ చేసినా, మనోవికారాలను జయించినా – ఇవన్నీ ఒంటరిగా సాధించవలసినవే. సద్గురు కృపతో, దైవానుగ్రహంతో ముందుకు సాగవలసిందే.

ఎన్నో పుణ్యక్షేత్రాలకు, సిరిసంపదలకూ నెలవైన భారతావని పుణ్య పురుషులు నడయాడిన స్వర్గధామం. సంతోష చిహ్నాలైన గ్రామాలలో విషాదపు ఛాయలు అలుముకుంటున్నాయి. సంక్రాంతికి వచ్చి సందడి చేసే పిల్లలు, మనవళ్ల రాక కోసం మసకబారిన కళ్లతో నిరీక్షిస్తున్న పెద్దలు మాత్రమే పల్లెల్లో మిగిలారు.

సంక్రాంతి నాలుగు రోజులు... కలిసి చెప్పుకునే ముచ్చట్లెక్కడ? పెద్దల మనస్సెరిగి ఊసులు చెప్పేదెవరు? ఇపుడు నగరాల్లో కూడా ఖండాంతరాలు వలసపోయిన పిల్లల రాక కోసం ఎదురు చూస్తున్న ఈ తరం పెద్దలు ఎందరో. భవిష్యత్‌లో అంగారక గ్రహంపై స్థిరపడే పిల్లల రాక కోసం అమెరికావాసులకు ఎదురుచూపులు తప్పవేమో! తరాలు మారినా, ప్రాంతాలు మారినా చూసే ఎదురుచూపులు ఒక్కటే.

సంక్రాంతికి వచ్చి సందడిచేసి, మరలా సంక్రాంతి వరకూ కానరాని పిల్లల కోసం ఎదురుచూపులు చూసేకంటే నీ హృదయంలో నిరంతరం సన్నిహితంగా ఉండే ఈశ్వరునితో ఊసులు చెప్పుకోవడం మిన్న కదా! అది నీ మనోవేదనను పలుచన చేస్తుంది కదా!

దేహగతమైన నేను, నాది అనే భావాలు సంసారాన్ని పెద్దది చేస్తాయి. సంసారమంటే మనఃసంసారమని. మనస్సు అణిగితే శాంతిని పొందగల మని, అంతవరకూ సంకల్పాలు, వికల్పాలూ తప్పవని, ఈ అనుబంధాలు శాశ్వతం కాదని గురువుల మాట.

బురదలో పుట్టినా తామరపువ్వుకు బురద అంటనట్లే, నీటిలో ఉన్నా తామరాకుకు నీరు అంటనట్లే బురదమయమైన ఈ ప్రపంచంలో మనో కల్పితమైన జగత్తుకు, సంసారానికీ అంటక రాగద్వేషాలకు అతీతంగా

జగత్తులో ఉంటూ, గురువర్యులు చెప్పినట్లు ఒంటరిగానే ఆత్మవిచారణా మార్గంలో పయనించి, హృదయంలో మనోలయం పొంది, శాశ్వత శాంతిని పొందడం సుసాధ్యమే కదా!

విని వదిలివేసిన ఉపన్యాసం కన్నా, తిని పారవేసిన విత్తనం మిన్న అని నానుడి. అది మొక్కగా పెరిగి, మహావృక్షంగా విస్తరించి, నిరాదరించిన వారికీ ఫలాలనిస్తుంది. ముళ్లబాట నుంచి పూలబాట వైపు చేయి పట్టి అడుగులు వేయిస్తున్న గురుదేవుల మాటల ఆచరణ ద్వారా ఆనంద సాగరమైన హృదయసాగరంలో ఓలలాడవచ్చు.



*ఓ అరుణాచలా! భౌతికమైన అగ్ని ఈ దేహాన్ని కాల్చి*
*బూడిద చేయకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి*
*నా జీవ లక్షణాలను బూడిద చేయి.*

*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# గురువైభవం

జ్ఞానస్వరూపులైన గురువైభవాన్ని వర్ణించడానికి ఏ కొలమానం లేదు. మలినమైన మనస్సులతో గురు వైభవాన్ని స్మరించగలమా? ఈ మాంస నేత్రాలతో ఆ వైభవాన్ని వీక్షించగలమా? అజ్ఞానమనే మంచుతెరల చాటు నున్న ఆ తేజస్సును కాంచగలమా? గురువు వైభవం అనే గజమాలలో క్రమశిక్షణగల శిష్యులంతా పరిమళభరితమైన పుష్పాలే. గమ్యం తెలియని పామర భక్తులకు ఆయనే చుక్కాని. అలజడులనే సుడిగుండాల నుండి ఈ జీవితనౌకను ప్రశాంత తీరాలకు చేర్చేది ఆయన కారుణ్యమే కదా!

ప్రతి జీవితానికీ నాన్నగారితో ఒక అపురూపమైన అనుభవమే. ఆధ్యాత్మిక ఔన్నత్యాన్నే కాదు లౌకికమైన ప్రగతినీ కాంక్షించిన మహోన్నత మూర్తి నాన్నగారు.

నాన్నగారి శారీరక రుగ్మతలు శిష్యులకు పరీక్ష. జ్ఞానబోధలో అంతర్భాగమే. చింతించవలసినది శుష్కించే శరీరం గురించి కాదని, అంతర్యామిగా ఉన్న నస్వరమైన ఆత్మనే చింతించాలని ఆత్మబోధ చేసారాయన. మానవ దేహం ధరించి వచ్చినపుడు సాక్షాత్తూ భగవంతుడైనా సరే శారీరక బాధలను అనుభవించవలసినదే అనే వివేకానందుని మాటలు స్ఫురణకు వస్తాయి.

మీ చెల్లి తనయుని మెడిసిన్ సీటు గురించి కాశీ విశ్వేశ్వరుని ప్రార్థించమ్మా అని వారణాసికి పయనమయ్యే ఒక భక్తురాలికి నాన్నగారి ఉవాచ. శిష్యుల అభ్యున్నతి గురించి ఆ తండ్రికి ఎంత తపన! ఎంత వాత్సల్యం! కుటుంబసభ్యుల కన్నా మిన్నగా మమతానురాగాలు పంచే ఆ ఆత్మీయ మూర్తిని ఏమని కీర్తించాలి!

పరిసర గ్రామాల నుంచి ప్రతిరోజూ నాన్నగారి దర్శనానికి వచ్చే భక్తులెందరో. ఎంత ఆత్మీయపు గుబాళింపు వెదజల్లకపోతే ప్రతిరోజూ ఎంతోమంది కళాశాలకు వెళ్లే విద్యార్థుల్లా, కార్యాలయానికి వెళ్లే ఉద్యోగుల్లా క్రమం తప్పకుండా సుదూర ప్రాంతాల నుంచి జిన్నూరు వస్తారు?

ఒక్క చీమ కూడా లేనిచోట బెల్లంముక్కను పెట్టిన వెంటనే ఎక్కడి నుంచి వచ్చి చేరతాయో ఆ పెరుమాళ్లకే ఎరుక. నాన్నగారు ఇంటి తలుపు తీసుకుని గుమ్మం దగ్గర నిలబడగానే ఎక్కడ ఉంటారో శిష్యులు అమాయకపు చూపులతో, బేలచూపులతో నాన్నగారి చెంతకు చేరిపోతారు. ఆ కోనేరు గట్టుపైనో, ఇంటికెదురుగా ఉన్న షెడ్డులోనో, ఆ గోడ ప్రక్కనో, రమణక్షేత్రం వద్దో వేచిచూసే భక్తులు ఒక్కసారిగా దరిచేరతారు. ఆ ఆత్మీయపు తియ్య దనానికి అలవాటుపడిన శిష్యులు కదా. ఆ సందర్భంలో బెల్లంతీపికి అల వాటుపడి వడివడిగా బారులుతీరి వచ్చే చీమలే జ్ఞప్తికి వస్తాయి.

గుండెల నిండా దుఃఖభారాన్ని మోస్తూ వ్యవహారిక విషయాలలో ప్రశాంతంగా ఉండగలిగేది ఆ గురువు అనుగ్రహంతోనే కదా అని ఒక భక్తురాలు మనోనిబ్బరంతో వెలిబుచ్చిన మాట. 32 సంవత్సరాల సాన్ని ధ్యంలో ఈ జన్మలో చేయవలసిన కర్తవ్యం హృదయంలో నుండి అందుతూనే ఉంది. ఆ తండ్రికి చెప్పని విషయమంటూ లేదు. నిరంతరంగా ఆయన దిశానిర్దేశం చేస్తూనే ఉన్నారని తన అనుభవాల స్మృతులను నెమరువేసు కున్నారు ఆ శిష్యురాలు.

నీవు తేనీరు బాగా చేసావమ్మా అని చిన్న విషయాన్ని సైతం గుర్తుంచు కుని, కృతజ్ఞతాపూర్వకంగా అభినందనను వ్యక్తంచేసే ఆ ఔన్నత్యానికి సాటిరాగల వారెవ్వరు?

రోజూ జిన్నూరు రావడానికి నీకు డబ్బులెక్కడనుండి వస్తాయమ్మా అని ఒక సామాన్య భక్తురాలి గురించి ఆలోచించే గురువు నీవుగాక మరెవరున్నారు ఈ లోకంలో...?

ఇంటి ప్రక్కనే ఉద్యోగం. కూతురుకి ఉన్నతమైన హోదా... ఇది ఆ తండ్రి భిక్షే కదా అని ఒక భక్తుని కృతజ్ఞతాపూర్వకమైన స్పందన.

గాలిని కాంచలేము. కాని మనిషి ఊపిరికి అదే ఆలంబన. ఎందరో శిష్యుల బ్రతుకు బాటలో ఆయనతో ఏర్పడిన మానసిన అనుబంధం ప్రాణ వాయువు లాంటిదే. భౌతికంగా దూరమైన గురువర్యుల జ్ఞాపకాల నుండి

బయటపడడానికి, దుఃఖభారాన్ని దించుకోవడానికీ శిష్యగణానికి చాలా కాలమే పడుతుంది.

ఎందరో శిష్యుల జీవన గమనానికి ఊపిరి ఆయనే. ఆయన నిర్వాణంతో సహజమైన ప్రాణవాయువు కరువైంది. ఇక కృత్రిమ శ్వాసే మిగిలింది. ఆయన అంతర్యామిగానే ఉన్నారనే స్పృహను అనుభవంలోకి తెచ్చుకోవడమే తక్షణ కర్తవ్యము. ఇకముందు భౌతికంగా అంత ఆత్మీయంగా చేరదీసేవారెవరు? ఆప్యాయంగా పలకరించేవారెవరు? ఎవరి చెంతన ప్రశాంతంగా సేదతీరగలము? నేనున్నానని భరోసానిచ్చేవారెవరు? శిష్యులకే ప్రత్యేకతనిచ్చే గురువెవ్వరు? ఒకవైపు భావశూన్యత, ఆగమ్యగోచరమైన భవిత. నలుదిశల ఆవహించిన అశాంతి. గుండెల నిండా దుఃఖ భారం వెంటాడుతోంది.

భావసారూప్యతతో ఉమ్మడి కుటుంబంగా సహజీవనం చేస్తున్న మనం నాన్నగారి ప్రవచనాలను మరింతగా శ్రవణం, మననం చేసుకుంటూ స్ఫూర్తి ని పొందవలసిన సమయం ఆసన్నమైంది. లౌకికమైన వ్యథలను చెప్పుకునే వాళ్లమేగాని శ్రద్ధతో వినేవారెవ్వరు? ఆ సమయాన్ని మన అజ్ఞానాన్ని తగ్గించు కునేందుకు వెచ్చించి, అంతర్యామిగానున్న నాన్నగారి దిశానిర్దేశంతో జ్ఞాన మార్గం వైపు వడివడిగా అడుగులు వేయవలసిన సమయమిదే. రమణునితో చెప్పుకుందామన్నా ఆ కష్టాన్ని చెప్పేవాడిని బయటకు పంపించమంటాడు. అతిథులందరినీ లోపలకు ఆహ్వానించడమే తెలుసుగాని బయటకు పంపడం అలవాటులేదే! మర్యాద తెలియని ఆ మహానుభావునికి చెప్పుకునే కంటే మౌనంగా ఊరుకోవడం మిన్న.

మేము అత్తెసరు మార్కులతో ఉత్తీర్ణులైనవారము. ప్రవేశపరీక్ష రాయ కుండానే, మంచి ర్యాంకులు రాకపోయినా, డొనేషన్లు కట్టలేకపోయినా ఏ అర్హతలూ లేకపోయినా, నీవు ఉదారంగా, నీ ఆధ్యాత్మిక పాఠశాలలో శిష్యు లుగా మాకు అడ్మిషన్ ఇచ్చావు. నీ నాడి మాకు, మా అజ్ఞానం నీకు తెలి సిన వాళ్లము.

శిష్యులను వదిలి ఉండలేని నీ బలహీనత మాకు తెలుసులే. నీకు మాత్రం ఇలాంటి శిష్యులు దొరుకుతారా ఏమిటి? నైపుణ్యం ఉన్న పనివాళ్లు

ఎక్కడికి వెళ్లినా పని దొరుకుతుంది. ఎవరూ ఒకే యజమాని దగ్గర స్థిరంగా ఉండరు. మేము నైపుణ్యం లేనివాళ్లమే. చెల్లాచెదురు కాకుండా ఒకేచోట స్థిరంగా ఉండే ఇంత శిష్యగణం నీకెక్కడ దొరుకుతుంది చెప్పు.

ఈ ఉపాధితో (శరీరంలో) ఉండగానే మరొక ఉపాధి (పని)ని చూపించుము. ఆ పని ఆత్మవిచారణ అయినా కావచ్చు. శ్రవణమైనా, మననమైనా, అంతఃకరణశుద్ధి కార్యక్రమమైనా ఏదైనా కావచ్చు. నీ ఇచ్ఛ, ఈ సంధి కాలంలో బాహ్యంగా చంచలచిత్తంతో మరలక అంతర్ముఖులయ్యేటట్లు అంతర్యామిగా నున్న నీవు మమ్ములను వశీకరణము చేయుము తండ్రీ.

కామక్రోధాలనే కాదు, మోహాన్ని కూడా వదిలిపెట్టమంటివి. మరి నీ మోహంలో పడవేసి నీ చుట్టూ శిష్యగణాన్ని రంగులరాట్నంలా తిప్పినావు. ఇది నీకు తగునా? ప్రాతఃకాలం వేళ దూళి దర్శనంతో మొదలుపెట్టి, రాత్రి శయనించే వరకూ దర్శనాలిస్తూనే ఉన్నావు. ఆచారాలు, పట్టింపులు, మడి... ఇలాంటి అడ్డంకులేవీ లేవు. చాలా సౌకర్యంగా ఉండేది మాకు. ఆ కొండపై నున్న మహర్షి వారసుడివి కదా! అందుకే శిష్యుల మనస్సెరిగి నీవు నడిచినావు. వారిని నొప్పించిన సంఘటన ఒక్కటీ లేదు. మా కుర్ర చేష్టలకు నీవు నొచ్చుకున్నావో లేదో మాకేటి ఎరుక? నీ హావభావాలనే చూడగలిగాము గాని, నీ హృదయంలోకి వెళ్లి చూసినవారము కాదు కదా!

'నీ కన్నీ సీతమ్మ కష్టాలేనమ్మా, నీ కష్టాలను దైవానికి మొరపెట్టుకుని ధైర్యంగా ఉండు... అవే సమసిపోతాయి' అని ఒక లేఖ ద్వారా శిష్యురాలికి ఇచ్చిన భరోసా ఈ తండ్రికాక ఎవరివ్వగలరు?

శిష్యులను పుణ్యక్షేత్రాలు తిప్పి పునీతులను చేసినా, సామాజిక స్పృహతో సేవాకార్యక్రమాలలో పాల్గొన్నా ఎంతటి నిబద్ధతయో కదా! ఈర్ష్యా ద్వేషాలు కొంచెమైనా అదుపులో ఉన్నాయంటే అది నీ చలువేకదా! ఇరుగు పొరుగువారిని గతం కంటే మిన్నగా గౌరవించే సంస్కృతి పెరిగింది. నాలుగు మంచి మాటలు శ్రవణం చేయాలనే ఆసక్తి కలిగింది.

సత్సంగం విలువ తెలిసింది. మా మనోఫలకాలపై మధురంగా లిఖించిన నీ మాటలు మననం చేసుకోవాలనే అభిలాష కలిగింది. ఏ

నోట విన్నా నీ ప్రేమతత్వం గురించిన ప్రస్తావనే.

తియ్యటి నదీ జలాలను సేవిస్తూ నీ పాదాల చెంతనే చేపపిల్లల్లా తిరిగాము. ఉప్పు నీటిమయమైన సాగరజలాల్లోకి కొట్టుకుపోతామేమోననే చింత కాబోలు... శిష్యులందరినీ వల వేసి, నీ పాదాల చెంతకు లాగావు. నేడు నీ పాదాలను భౌతికంగా కాంచలేకున్నాము. వలని ఎవరు పైకి లాగినా ఊపిరాడక గిలగిల లాడతాము.

నీవు మరొక రూపంలోనైనా గురువుగా వచ్చి వలను ఒడిసి పట్టుకో తండ్రీ... ఈ జన్మలో నీ రూపానికి, నీ నామానికీ మమేకమైన వారము. నీ పాదాల చెంతనే సేదతీరాలని మనసు పడినాము. మరొక జన్మలోనయినా నీ సాన్నిధ్యాన్నే కోరుకుంటున్నాము. రూప బుద్దిని, నామ బుద్దిని రూపుమాప మంటివి.

భూమ్యాకర్షణ శక్తిని దాటి అంతరిక్షంలోకి దూసుకువెళ్లే రాకెట్ వేగాన్ని మాకు ప్రసాదించి, నీ ఆకర్షణ శక్తిని దాటేటట్లు దారి చూపుము. లేదా ముక్తినొందువరకూ నీ ముగ్ధ మనోహర రూప నామములను విడనాడని స్థిర చిత్తమును ఏర్పరచుము తండ్రీ... మా హృదయాలలో అంతర్యామిగా ఉంటూ నీ పాదాలను వీడి వెళ్లలేని విధంగా వలను మరింత ఒడిసి పట్టినావు. ఆ బంధం మాకు తెలియనిది కాదులే...

ఆనాడు నీ ఉపన్యాసం విని పోదామని కాలక్షేపం కోసం నీ చెంతకు వచ్చాను. వేలాదిమంది ఆ విధంగానే తొలిసారి నీ సన్నిధికి వచ్చి ఉంటారులే... ఏ వశీకరణ మంత్రం వేసావో గానీ నాటినుంచి నేటివరకూ నీ పాదాల చెంతనే ఉన్నాము.



*'నేను' అనే తలంపు ఎక్కడ పుడుతుందో చూడు.*
*అక్కడే మనస్సు లయిస్తుంది. అదే తపస్సు.*
*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# ప్రేమక్షేత్రం

జిన్నూరు రమణక్షేత్రం ప్రేమక్షేత్రంగా విలసిల్లాలని భక్తుల అభిలాష. ఆయన ప్రేమతత్వం గురించి భక్తులు వేనోళ్ల కీర్తిస్తారు. సుగుణాభిరాముడైనా భక్తులను ఎక్కువగా ఆకర్షించినది ఆయన ప్రేమతత్వమే. వర్ణబేధంలేని వాత్సల్యం, స్థాయీబేధంలేని సాంగత్యం, సంపదతో పనిలేని సాన్నిహిత్యం ఆయన ప్రదర్శించారు.

శాంతి కోసం సమాజం ఎంతగా పరితపిస్తోందో చెప్పడానికి ఆయనకు చేరువైన శిష్యగణమే సాక్ష్యం. అంతులేని శాంతి సౌఖ్యాన్ని శిష్యులు ఆయన సన్నిధిలో ఆస్వాదించారు. నిజమైన సుఖశాంతులు బాహ్యంగా లేవు. బయటినుంచి ఏది పొందినా అది కాలగర్భంలో కలిసిపోయేదే. అది ఎంతో కాలం నిలబడదని ఆయన హితబోధ చేస్తూండేవారు.

అంతర్ముఖులైతేనే శాంతిని పొందగలరని ఆయన చెప్పిన ప్రవచనాలు శిష్యులలో ఆలోచనా మదనాన్ని ప్రోత్సహించాయి. ఒక జ్ఞాని వైభవం అంత అద్భుతంగా ఉంటుందని భక్తులకు అనుభవంలోకి వచ్చింది. సమయ పాలన సైతం పాటించకుండా వ్యక్తిగత, కుటుంబ, లోకంలో సమస్యలన్నీ ఆయనకు ఏకరువు పెట్టినా ఎంతో సహనంతో విని, పరిష్కారాలు చూపే ప్రేమతత్వం ఆ జ్ఞానికి కాక ఎవరికుంది?

నాకు రమణుడన్నా, అరుణాచలమన్నా అచంచల ప్రేమ అని చెప్పే నాన్నగారు అరుణాచలంలో అన్న ఈ మాటలు భక్తుల పట్ల ఆయనకు ఉన్న ప్రేమకు తిరుగులేని తార్కాణం. "రమణాశ్రమం సందర్శించడం కన్నా, అరుణాచలేశ్వరుని దర్శించడం కన్నా ఈ భక్తులతో కలిసిమెలిసి ఉండడమే నాకు ఇష్టం".

భక్తులు నా బోధనలు అర్థం చేసుకోలేకపోతే తప్పు వారిది కాదు. నాదే. వారు ఆధ్యాత్మికంగానే కాక భౌతికంగా కూడా అభివృద్ధి చెందాలనేది

నా కోరిక. వారు ఆ చైతన్య స్థాయిని పొందాలి. నా భక్తులు అందరూ తరిస్తారు. తరించేవరకూ నేను వారి వెన్నంటి ఉంటాను అని నాన్నగారు భరోసా ఇచ్చారు.

"నేనింకా ఏ భక్తుల బాధల కోసం కష్టపడాలి?" అని చివరి రోజుల్లో ఆయన అన్న మాటలు భక్తుల జీవితాలతో ఆయనకు ఉండే అనుబంధాన్ని స్ఫురణకు తెస్తుంది. భక్తుల బాధలను తాను స్వీకరించి, తన శాంతిని వారికి పంచిన ఔదార్యమూర్తి నాన్నగారు. శిష్యులను వేరుగా ఉంచి, ఆయన జీవితచరిత్రను అధ్యయనం చేయడం సాధ్యం కాదు.

శిష్యుల జీవితమే ఆయన జీవితం. వారి బాధలే ఆయన బాధలు. వారి సంతోషమే ఆయన సంతోషం. వారి కష్టమే ఆయన కష్టం. వారి సుఖమే ఆయన సుఖం. ఇంతగా భక్తుల జీవితాలతో మమేకమైన గురువు ఈ ప్రపంచంలో ఎక్కడా కానరారు - ఒక్క నాన్నగారు తప్ప.

శిష్యులతో 'నాన్నగారు' అని ఆప్యాయంగా పిలిపించుకున్నప్పటికీ ఆయనలో ఎక్కువగా కాంచినది 'అమ్మతనాన్నే'. అమ్మ చూపించే సహజమైన ప్రేమను ఆయన ప్రతి క్షణం చూపించారు. నాన్నకు మనసులో ఎంత ప్రేమ ఉన్నా అది అవ్యక్తంగానే ఉంటుంది. అమ్మ ప్రేమ అలా కాదు. ప్రతి క్షణం వ్యక్తమవుతూ ఉంటుంది. ఒక నాణానికి బొమ్మ, బొరుసులా అమ్మ, నాన్న ఆయనే. నాన్నలా బాధ్యతగా, అమ్మలా ప్రేమగా వ్యవహరించే వారు. ఆ విధంగా బాధ్యతతో కూడిన ప్రేమను, ప్రేమతో కూడిన బాధ్యతను ఆయన చూపించారు.

చివరి రోజులలో నాన్నగారు బాహ్య స్పృహలో లేనట్లు భక్తులకు అనిపించినా ఆయన ప్రతి క్షణం ఎరుకలోనే ఉన్నారని, ఆ చైతన్య స్థాయిలో రమిస్తూ, శాంతి సౌఖ్యాలను అనుభవించారని, వారికి సన్నిహితంగా మెలిగిన శిష్యుల మాటల ద్వారా అవగతమవుతుంది. నిజానికి చైతన్యపరమైన ఎరుక లేని మన గురించి, మన అజ్ఞాన స్థాయి గురించి ఆయన నిరంతరం

మదనపడుతూనే ఉండేవారు.

ఆయన బోధ వేదికలకు మాత్రమే పరిమితం కాదు. సూర్యోదయం కాకముందే తన ఇంటి అరుగుపై వేచి చూసే శిష్యుల యోగక్షేమాలు విచారించడంతో ప్రారంభమయ్యే వారి బోధనలు రాత్రి నిదురించే సమయం వరకూ కొనసాగుతూనే ఉండేవి. దపదపాలుగా నలుగురైదుగురు శిష్యులు వచ్చినా సంభాషణల రూపంలో బోధిస్తూనే ఉండేవారు. తేనీరు సేవించేటప్పుడు... వీధి గుమ్మం దగ్గర నిలబడి ఉన్నప్పుడు... కారులో ప్రయాణించేటప్పుడు... ఎక్కడ చూసినా బోధనలే. రైల్వే స్టేషన్‌లో నిరీక్షించేటప్పుడు భక్తులకు చెప్పిన ఆధ్యాత్మిక విషయాలు ఎన్నెన్నో. బోధించని ప్రదేశమెక్కడ? స్పృజించని జ్ఞానసంబంధమైన విషయమేది? చివరకు ఆసుపత్రిలో ఉన్నప్పుడు సైతం శిష్యులకు జ్ఞానఫలాలు పంచుతూనే ఉన్నారు.

గ్రహించగలిగే బుద్ధి సూక్ష్మత ఉండాలేగానీ, ఆయన నోటినుండి వెలువడిన ప్రతి పలుకూ జ్ఞానమే. కొన్ని లౌకిక విషయాలు ఆయన శిష్యులతో సంభాషించినా, శిష్యులను మచ్చిక చేసుకుని ఆధ్యాత్మిక మార్గం వైపు తీసుకువెళ్లడానికి ఆయన ఉపయోగించిన ఒక ప్రక్రియ. తన దరిచేరిన శిష్యులతో వారికి నచ్చిన విషయాలనే ప్రస్తావిస్తే కుదురుగా కూర్చొంటారని ఆయన ఆలోచన కావచ్చు... పచ్చగడ్డి కోసం చెంగుచెంగున గంతులేసుకుంటూ వచ్చే లేగదూడల మాదిరిగా తన శిష్యులకు 'ప్రేమ' అనే పచ్చగడ్డిని ఎరగావేసి, తనవైపు తిప్పుకునేవారు. ఆధ్యాత్మికవనంలోకి తోలుకుని వెళ్లడానికి అది ఒక సాధనం కాబోలు.

నీవు గురువు వాక్యాన్ని, శాస్త్ర వాక్యాన్ని విస్మరించి, ఇంద్రియాలు మరియు మనసుకు దాసోహమవుతావా? అవి నిన్ను ఉద్ధరిస్తాయా? ఆ మార్గంలో వెళితే నీవు ఎలా తరిస్తావు? నీవు సన్మార్గం వైపు పయనించాలని నాన్నగారు తన శిష్యులకు పదేపదే కర్తవ్యబోధ చేసేవారు. నీ ఆలోచన, నీ వాక్కు, నీ క్రియ మూడూ ఒకే విధంగా ఉండాలి. అప్పుడే మనస్సు నిర్మలమై శాంతి కలుగుతుందని జ్ఞానబోధ చేసేవారు.

నాన్నగారు తన ఆధ్యాత్మిక వనంలో ప్రేమ, వాత్సల్యం, వినయం, విధేయత, ఓర్పు, సహనం, కారుణ్యం, ఏకత్వం వంటి తులసి మొక్కలను ఎన్నింటినో నాటారు. ఆ వనంలో సేదదీరే అవకాశం కలగడమే భక్తుల పూర్వజన్మఫలం.



*తల్లిలేని ఉడుత పిల్లలు గూటిలోనే ఉంటే సుఖమని తెలియక,*
*గూటిలో నిలువలేక బయటికి వెళ్లడానికి ప్రయత్నించి,*
*బాధలు పడినట్లే మనస్సు ఉన్నచోటనే (హృదయంలో) ఉంటే*
*సమస్య లేదు. అది బయటకు వెళ్లడానికి ప్రయత్నించినపుడల్లా*
*దానిని తీసి, గూటిలో పడెయ్యాలి.*

*– భగవాన్ శ్రీ రమణమహర్షి*

# రావోయి గురుదేవా!

1. ప్రభాత వేళ నిత్యపారాయణం చూడగ
రావోయి గురుదేవా, మా చెంతకు రావోయి గురుదేవా!

2. మధ్యాహ్న వేళ ప్రవచనాలు చెప్పుకునే భక్తులను దీవించంగ
రావోయి గురుదేవా, మా చెంతకు రావోయి గురుదేవా!

3. పర్వదినాలలో సత్సంగ వేడుకను చూడంగ
రావోయి గురుదేవా, మా చెంతకు రావోయి గురుదేవా!

4. చల్లని వెన్నెల కాంతిలో నీ చల్లని చూపుకై నిరీక్షించే
భక్తుల చెంతకు
రావోయి గురుదేవా, శీఘ్రమే రావోయి గురుదేవా!

5. నీ ప్రేమ తత్వాన్ని హృదయంలో పదిలంగా దాచుకున్న
నీ శిష్యులను దీవించంగ
రావోయి గురుదేవా, త్వరితగతిని రావోయి గురుదేవా!

6. గురువైభవాన్ని గుర్తెరిగి చెప్పుకునే నీ శిష్యుల చెంతకు
రావోయి గురుదేవా, మెరుపులా రావోయి గురుదేవా!

7. అందమైన ఆత్మీయ పుష్పాలతో నీ సన్నిధిని అలంకరించే
నీ బిడ్డలను దీవించంగ
రావోయి గురుదేవా, మమ్ము దీవించ రావోయి గురుదేవా!

8. మధురమైన అనుభవాల పొరలు విప్పి మైమరచే
సాధుజనుల సంతృప్తి పరచ
రావోయి గురుదేవా, వాయు వేగాన రావోయి గురుదేవా!

9. శాంతి కోసం తపించే శిష్యుల అశాంతి మూటలు విప్పంగ
ఈ అభాగ్యుల చెంతకు
రావోయి గురుదేవా, వేగిరం రావోయి గురుదేవా!

10. రమణక్షేత్రం పుణ్యక్షేత్రంగా విలసిల్లుతోందని భక్తులకు చెప్పంగ
రావోయి గురుదేవా, మనోవేగాన రావోయి గురుదేవా!

11. నీవు నడయాడిన చలువరాళ్లు భక్తుల హృదయాల్ని
చల్లబరచిన సొగసు చూడంగ
రావోయి గురుదేవా, కాంతి వేగాన రావోయి గురుదేవా!

12. నీ హృదయమనే తేనె తుట్టెలో శాంతి మకరందాన్ని గ్రోలిన
ఈ జిజ్ఞాసువుల హృదయశాంతిని స్థిరపర్చంగ
రావోయి గురుదేవా, రావోయి గురుదేవా!

13. రంగు రంగుల రంగవల్లికలతో నీ సన్నిధిని నిత్యశోభాయమానం
చేసే జిన్నూరువాసుల శ్రద్ధాసక్తులను చూడంగ
రావోయి గురుదేవా, ప్రేమతో రావోయి గురుదేవా!

14. శిష్యరేణువులు ఒక్కొక్కరుగా హృదయఘోషను
వేదికపై విన్పిస్తున్న తీరు చూడంగ
రావోయి గురుదేవా, మా చెంతకు రావోయి గురుదేవా!

15. శ్రవణమట, మననమట, శరణాగతి యటంచు
పరిణతి చెందుతున్న శిష్యుల ఉన్నతిని వీక్షించగ
రావోయి గురుదేవా, మమ్ము దీవించ రావోయి గురుదేవా!

16. నిత్య పూజలివిగో, నిత్యాన్న ప్రసాదములవిగో...
నీ చలువతో నిరాటంకంగా సాగే సొగసును చూడంగ
రావోయి గురుదేవా, నిత్యమూ మా వద్దకు రావోయి గురుదేవా!

17. నీ ప్రేమతత్వాన్ని తనివితీరా ఆస్వాదించాలని తపించే
ఈ నిర్భాగ్యుల మొర ఆలకించ
రావోయి గురుదేవా, తరచుగా మా చెంతకు రావోయి గురుదేవా!

18. ఆప్యాయపు పలకరింపులు, ప్రేమపూర్వక పిలుపులూ
మరల రుచి చూపంగ
రావోయి గురుదేవా, క్షణకాలంలో రావోయి గురుదేవా!

19. 'ఆత్మబంధువుల'నే సంబోధనతో బంధుగణాన్ని పెంచినావు
మరి మమ్ము చూడంగ
రావోయి గురుదేవా, చుట్టపు చూపుగానైనా రావోయి గురుదేవా!

20. సన్యాసిగా అవతరించి, శేష శిష్యులను ఉద్ధరించవలెననే
సంకల్పమట – మమ్ము దరిచేర్చంగ
రావోయి గురుదేవా, సద్గురుమార్గం చూప రావోయి గురుదేవా!



*ప్రపంచంలోని ఏ వస్తువులోనూ సుఖం లేదు. అది నీ హృదయంలో ఉంది. హృదయంలో వెతికితే అది లభిస్తుంది.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# రమణ తరంగం

1. అళగమ్మ, సుందరయ్యర్‌ల తనయునిగా
జన్మించిన వెంకటరామన్ కౌమారంలోనే
తిరుచ్చుళి పులకించే విధంబుగా
ఎదిగిన వైనం తెలియపర్చుము ఓ అరుణాచలా!

2. పై చదువులకై పినతండ్రి చెంతకు చేరి
ఆటపాటలందెగాని చదువులయందు
అనురక్తిలేకున్నా ఆత్మ చదువునేర్చిన విధంబు
ఎరుకపర్చుము ఓ అరుణాచలా!

3. మధుర మీనాక్షి సన్నిధి పెరిగిన వెంకటరామన్
ఆధ్యాత్మిక శ్రవణం, మననం లేని స్థితియందు
కౌమారదశలో మరణానుభవం పొందడం
నీ చలువే కదా ఓ అరుణాచలా!

4. బాల్యంలో ఆటలయందే అనురక్తి – చదువుసంధ్యలందు నిరాసక్తి
అపారమైన ఆధ్యాత్మిక సిరిసంపదలు
ఏడ నుండి వచ్చినవో ఓ అరుణాచలా
నీవు అరుణాచల అంశయే కదా ఓ భగవాన్!

5. గాఢనిద్రలోనున్న నిన్ను తొడ్కొనిపోయి సహచరులు దేహశుద్ధి చేసి
మరల యధాస్థితిలో పరుండబెట్టినా తెలివిలేదట
అది మొద్దునిద్రయో, యోగనిద్రయో ఎవరికెరుక అరుణాచలా
ఈ మర్మమేమిటో తెలియజేయము ఓ అరుణాచలా!

6. బ్రాహ్మణస్వామిగా ఉలుకు, పలుకు లేని
వెంకటరామన్‌ను భగవాన్ రమణమహర్షిగా
కావ్యకంఠుల ద్వారా జగతికి చూపింది
నీవేకదా ఓ అరుణాచలా!

7. ఆత్మవిద్యకై ఆర్తితో అడిగే అల్పజనులను
అడిగేవాడిని పారద్రోలమంటివి జన్మాంతరముల నుండి
ప్రాణస్నేహితుడైన 'నేను'ను పొమ్మనడం మిత్రద్రోహం కాదా
ఆ పని నీవే చేయుము ఓ అరుణాచలా!

8. అరుణాచలమేతెంచి అర్ధశతాబ్ధియైనను
అడుగైననూ అరుణాచలం దాటింది లేదు
నలుదిశల నుండి పండిత, పామరులను బేధంబు లేక
ఆర్తితో అమృతాన్నిగ్రోలగ నీచెంతకె వచ్చినారు ఏమి భాగ్యమరుణాచలా!

9. ఉడుతలు, పిల్లులు, కోతులు, చిలుకలు
మనుష్యులతో సమంగా మన్ననలు పొందినాయి
బేధంబు తనువులకేగాని, ఆత్మకు కాదని
సర్వప్రాణులను ఆత్మస్వరూపులుగానే ప్రేమించితివి ఓ అరుణాచలా!

10. ప్రారబ్ధానుసారమే జీవన గమన ముంటుందని
'ఈశ్వర శరణాగతే ఉత్తమము', 'మౌనమే శరణ్యము'
తల్లికి రాసిన ఈ మొదటి చీటి సందేశమే
లోక సందేశము కదా ఓ అరుణాచలా!

11. కఠినశిలలాంటి పెరుమాళ్‌స్వామిని
భావావేశాలు తొలగించి దూదెపింజలా చేసినావు
శిష్యులు నిరాకరించినా వెన్నలాంటి హృదయంతో
చల్లదనాన్నిచ్చినావు ఓ అరుణాచలా!

12. అక్షరములనే మాలగా కట్టి రమణులు
భక్తిపూర్వకంగా నీ మెడలో వేసినారు
మాలకట్టంగ అక్షరములు లేవు
మౌనమాలతో అలంకరించ అనుమతీయుము ఓ అరుణాచలా!

13. 'నేనెవరను?' అను విచారణతోనే
మనోక్షయమవుతుందని
ఉత్కృష్టమైన ఆత్మవిచారణే మేలని
సూటియైన మార్గము చెప్పితివి ఓ అరుణాచలా!

14. రామనాథ బ్రహ్మచారి, మొదలియార్‌పాటి వంటి నిరాడంబరులు
నిస్వార్ధ సేవా పరాయణతతో నిన్ను సేవించి తరించారు
సంపూర్ణ శరణాగతితో ఆత్మసాక్షాత్కారము పొందుట
నీ చలువే కదా అరుణాచలా, ఓ అరుణాచలా!

15. రత్నమ్మాళ్, దేసూరమ్మాళ్, ఎచ్చెమ్మాల్ వంటి
ఎందరో సాత్వికులు నీకు బిక్ష తెచ్చినారు
మాటలకందని మానసిక అనుబంధమొందిన
వారెంత ధన్యులో కదా ఓ అరుణాచలా!

16. అలసటనొందిన మనస్సులతోటి
బరువెక్కిన హృదయాలతో
మౌనంగా నిలుచున్న ఓ ఆత్మీయులారా
మీకు చింతయెందుకు... మీ చెంత రమణులుండగ

17. విషయాలపై చింతన వీడి
చింతించే మనస్సును హృదయం చెంతకు గొనిపొమ్ము
హృదయంలోనున్న ఈశ్వరుడు
ఊరట నివ్వడా ఓ అరుణాచలా!

18. స్మరణయే చాలు మోక్షప్రాప్తికి
'అరుణాచలా, ఓ అరుణాచలా'
అహమునణచి హృదయంలో
బందీని చేసినావు ఓ అరుణాచలా!

19. భక్తి జ్ఞానమనే అక్షరాలను
మాలగా కూర్చి ముచ్చటపడినావా ఓ అరుణాచలా
మలినమైన మనస్సులతో ఏ మాలను కట్టి
నీకర్పించగలవారము ఓ అరుణాచలా?

20. మధురమైన అనుభూతులు
మధురైలోనే పొందినావు
అరుణాచలమేతెంచి అదనంగా
పొందినదేమి ఓ అరుణాచలా!

21. ఉద్ధండ తమిళ పండితులైన మురుగనార్
సూటియైన విచారణా మార్గాన్ని రమణుని నుంచి లోకానికందించారు
అతి నిరాడంబర పవిత్ర జీవితం గడిపి ధన్యులైనారు
అది నీ అనురాగమే కదా ఓ అరుణాచలా!

22. చిన్నస్వామికి ఆశ్రమ నిర్వహణ బాధ్యతనిచ్చి
సాధకుల మురికి నొదల్చ చాకలి బండలా వాడినావు
అంతేవాసులు ఆధ్యాత్మిక సాధనలో ప్రతిబంధకములు లేక
సంపూర్ణముగ నిమగ్నమయ్యేటట్లు చేసితివా ఓ అరుణాచలా!

23. అప్పడపు పాటతో తల్లి అళగమ్మ
జన్మజన్మల వాసనలను క్షయము చేసినావు
జిహ్వాచాపల్యంతో వేడుకొనుచున్నాము
నీవు చేసిన అప్పడములు రుచి చూపించుము తండ్రీ!

24. ఉడుతల విలాసం, చిరుతల సంచారం
నెమళ్ల సోయగాలు, సర్పాలతో చెలిమి
స్కందాశ్రమ - రమణాశ్రమాలలో నిత్యకృత్యాలే
ఇలాంటి మనోహర అబ్బురపరిచే దృశ్యాలెన్నెన్నో ఓ భగవాన్!

25. 'ఏ దారిన పోవాలి?' అని అడిగిన ఆశ్రమ సందర్శకునికి
'వచ్చిన దారినే పో' అనే నీ బోధ ఎంత సూటియైనది !?!
పరిహాసమనుకొని బిత్తరచూపులు చూస్తున్న అజ్ఞాన భక్తునికి
'హృదయదారి' అని విశదపర్చిన శిష్యులు ధన్యజీవులే ఓ అరుణాచలా!

26. ఉద్ధండపండితులు, సంపన్నులు, న్యాయకోవిదులు
ఐశ్వర్యాలను, వృత్తిప్రవృత్తులను తృణప్రాయంగా నెంచి
అరుణాచల వీధులలో బిచ్చమెత్తి సాధన చేసిన తీరు
నీ కృపాకటాక్ష వీక్షణాలతోనే కదా ఓ అరుణాచలా!

27. మలిన మనస్సులైనా శిష్యులుగా స్వీకరించి ఆదరించినావు
నిర్మలత్వం, సమత్వంతో చెంతకు చేరదీసినావు
ప్రథమ పంక్తిలో మాకు కడుపు నిండా పెట్టి కడపంక్తిన భుజించినావు
అమృతతుల్యమైన ఆత్మానుభవమును నీవు ముందే గ్రోలి, మాకు
రుచిచూపించక దాచినావు, ఇది నీకు తగునా ఓ అరుణాచలా!

28. హృదయమే అరుణాచలమని తెలియజెప్పినావు
హృదయంలో మునిగితే సహజస్థితి, శాంతిని పొందగలవని పలికినావు
స్వస్వరూప జ్ఞానమే సాధకుని కర్తవ్యమని బోధపరచినావు
శ్రావ్యమైన, మృదువైన కంఠధ్వనితో మైమరపించినావు ఓ అరుణాచలా!

29. శ్రీ రమణ భాషణములు మునగాల వారి
కలం నుంచి జాలువారిన దివ్యస్మృతులు
భక్తులతో రమణుని సంభాషణలు, మౌన బోధనలు
మా మనోఫలకంపై పొందుపర్చిన మునగాల వారు
ధన్యజీవులే ఓ అరుణాచలా!

30. ఉండుట మన నైజమని, సహజ స్థితియని
రావడము, పోవడము మనస్సు చేసే మాయయని
మౌనాన్ని వీడకుండుటే మన బాధ్యతయని
సహజ శాంతికై అంతర్ముఖులవ్వాలని కర్తవ్యబోధ చేసితివా ఓ అరుణాచలా!

31. హృదయసంద్రంలో దారి చూపక ముంచివైచినావు ఓ రమణా
ఆకాశంలో పక్షిలా ఎగరంగ రెక్కలు లేవు
నీటిలో చేపలా ఈదంగ నేర్పు లేదు
పరిపూర్ణ శరణాగతియే శ్వాసగా తేలియాడుచున్నాను దారి చూపుము తండ్రీ!

32. సరళమైన, సహజమైన రచనా కౌశలంతో
సూరినాగమ్మ అన్నకు రాసిన 'శ్రీ రమణాశ్రమ లేఖలు'
రమణుని నడక, నడత, చూపు, మాట, మౌనం ప్రతి విషయం
అమృతతుల్యమై భక్తులకందించి ఆత్మబంధువులైనారు ఓ భగవాన్!

33. రమణాశ్రమానికి ఒంటరిగా వచ్చిన గోమాత
లక్ష్మి నామధేయంతో సంతతిని వృద్ధిచేసి
రమణుని సన్నిధిలో సేదదీరి అమరత్వాన్ని
పొందిన విధంబు నీ కరుణే కదా ఓ భగవాన్!

34. సంసారమంటే మనస్సంసారమని
మనస్సును విడిచి శరీరము తిరిగిన బందరహితమేనని
శరీరమును ఉంచి మనస్సు సంచరించిన బందహేతువేనని
బహు చక్కగ పలికితివి ఓ అరుణాచలా!

35. ఆత్మ ఉనికి వెదుకుట పాండురంగని భక్తులు
దీపస్తంభం చుట్టే ఆటలాంటిదట
ఆత్మ ఎరుకకై ఆత్మ చుట్టూ తిరుగుతూ
జ్ఞాన వెలుతురులో ఇదే ఆత్మయందురట ఓ అరుణాచలా!

36. రోటిపచ్చడి చేసినా, కూరలు తరిగినా, అల్పాహారం వండినా
వంటవానివలె నిమగ్నతేగాని, మహర్షియనే ప్రత్యేకతే లేదు
మితాహారం, మితభాషణం, స్వల్ప విశ్రాంతియేనట
ఒక్క మనస్సు తప్ప పనికిరానివస్తువంటూ నీ దృష్టిలో లేనేలేదట
ఓ అరుణాచలా!

37. ఏకాంతమనేది మనోవైఖరట
నిరాసక్తుడు ఏకాంతవాసియట
కర్మ చేస్తున్నాననే తలంపే బంధమట
దైవనిర్ణయం ప్రకారం జరిగేది జరుగునట ఎంత సూటి బోధయో
ఓ అరుణాచలా!

38. రమణ తరంగం సప్త సముద్రాలను దాటి
ఖండాతరాలు వ్యాప్తిచెందగ, దేశవిదేశాల నుండి
ఎందరో ఆర్తితో రమణుల చెంతకు చేరి
సేదతీరి శాశ్వత శాంతిని పొందుట నీ కృపే కదా ఓ రమణా!

39. రమణులతో అరుణగిరి ప్రదక్షిణ అంతేవాసుల హృదయాలలో
మధురాతి మధురమైన అనుభూతులను మిగిల్చెను
రమణుడు నడిచిన ఆ దారిలో గిరిప్రదక్షిణ
ఈనాటికీ భక్తులకు పులకింతే కదా! ఓ అరుణాచలా!

40. ఆంధ్రదేశమంతా ఆత్మీయతలు పంచి
జ్ఞానతరంగాలు, ప్రేమతరంగాలు ప్రవహింపజేసి
భౌతికంగా ప్రకృతి సోయగాలకు నెలవైన జిన్నూరులో స్థిరపడి
భక్తుల హృదయాలలో కొలువైన నాన్నగురుదేవులు నీ అంశయే కదా
ఓ అరుణాచలా!



సాధన చేసి హృదయం యొక్క లోతులను పెంచుకునే వాడిని
బాహ్య సంఘటనలు బాధించవు.
– సద్గురు శ్రీ నాన్నగారు

# మాతృదేవోభవ

1. నవమాసాలు మోసి ప్రసవ వేదనననుభవించి
బిడ్డకు జన్మనిచ్చిన మాతృమూర్తికి వందనం

2. ప్రాణాలను పణంగా పెట్టి మనోవికారాలననుభవించి
తన అంశను పుడమిపైకి తెచ్చిన పవిత్రమూర్తికి వందనం

3. గర్భస్త శిశువు తన్నులకు పులకించి
అందాన్ని, ఆరోగ్యాన్నీ తృణప్రాయంగానెంచిన తల్లికి వందనం

4. కడుపుకోతకు వెరవక ప్రసవంలో ఆనందక్షణాలు వెతుక్కునే
నిష్కల్మషమూర్తులు మాతృదేవతలకు వందనం

5. చిట్టిపాదాలతో గుండెలపై తన్నినా మైమరచే
స్వార్థంతో గుండెకోతను మిగిల్చినా క్షమించే
ప్రేమైకమూర్తికి వందనం

6. బిడ్డల మనస్సులలో స్వచ్ఛత లేకపోవచ్చు ఈ లోకంలో
కల్తీలేని స్వచ్ఛమైన హృదయం గల తల్లులందరికీ వందనం

7. మాతృమూర్తిని దూషించే హక్కు లేదెవ్వరికీ
ఆ బిడ్డడు కూలీనాలీ చేసే సామాన్యుడైనా, దేశాధినేతైనా

8. తల్లిఒడిలోనున్నంత వరకూ భవిష్యత్ భయంలేదేబిడ్డకూ
ఒత్తిడి లేదు, నిద్రలేమి లేదు, ఆకలంటే తెలియదా బిడ్డకు

9. పేదరికంలో మ్రగ్గే స్త్రీయైనా, సంపన్నురాలైనా
ఏ బిడ్డనూ పస్తు ఉంచిన తల్లి ఈ లోకంలో లేనే లేదు.

10. బిడ్డకు తల్లిచేయి విడిచినప్పటి నుండి వచ్చినాయి అన్ని రుగ్మతలు
తల్లిలా మనకు భరోసానిచ్చేవారెవరున్నారు?
ఈ లోకంలో ఒక అమ్మ తప్ప

11. గోరుముద్దలు తినిపించి నడకను, నడతనూ నేర్పి
అనుబంధాలను, ఆత్మీయులనూ పరిచయం చేసిన
అమ్మకు వందనం

12. అక్షరాలు నేర్పి బడికి దారి చూపిన తొలి గురువుకు వందనం
గుడిని, గుడిలో దేవుణ్ని ప్రార్థించడం నేర్పిన అమ్మకు వందనం

13. సహజ ప్రేమకు ప్రతిరూపమైన అమ్మ కడుపుకు కోత పెట్టవద్దని
ఆమె ఆరోగ్యమే లోకకల్యాణమని వైద్య వ్యాపారులను ప్రార్థిద్దాం

14. ఏడాదికి ఒకరోజు మాతృదినోత్సవమంటే సిగ్గుచేటు కదా!
ప్రతిరోజూ మాతృదినోత్సవమే కదా!
ఆమె ఋణం తీర్చగల సంపన్నుడెవరీ లోకంలో



*తానెవరో తెలుసుకోకుండా ఏదో సాధించానని ఎవరైనా అనుకుంటే
అది ఒకటి లేని సున్నాలతో సమానం.*

*– సద్గురు శ్రీ నాన్నగారు*

# మాతృప్రేమ

1. అమ్మప్రేమకు అంతులేదు, ఆకాశానికి హద్దేలేదు
అలుపెరుగని ప్రేమకు పరిమితిలేదు

2. కన్నతల్లికి ఓర్పును పుడమితల్లి నేర్పిందా?
విసిగించే పిల్లలను ఎంత సహనంతో చూడాలని...!

3. కొండకోనల నుండి జాలువారే జలపాతంకన్నా ఉప్పొంగే గోదారికన్నా
కన్నతల్లికి పిల్లలపై తొలకరి జల్లులా వెదజల్లే ప్రేమే మిన్న

4. వీనులవిందైన చల్లటి పిల్లగాలుల సవ్వడిని చూడు
అమ్మప్రేమ తరంగాల వలె రమణీయంగా ఉన్నాయిగా

5. అమ్మఒడిలో వెచ్చదనం పిల్లలకు స్వాంతనే కదా
అమ్మకు ఆ వెచ్చదనాన్ని అగ్నిదేవుడే ఇచ్చాడా?

6. అడగందే అమ్మయినా పెట్టదనే నానుడిలో నిజమెంత?
అడిగితేనే కానీ పెట్టని అమ్మ లేదు ఈ లోకంలో

7. 'కాకిపిల్ల కాకికే ముద్ద'నే సామెతలో ఒక నిజముంది
తల్లి తనయ రూపం చూడదని, పసిబిడ్డలో తననే చూసుకుంటుందని

8. ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకే అనే లోకోక్తి ఉన్నది
అధికారదర్పాలు, అష్టైశ్వర్యాలున్నా తల్లిముందు దిగదుడుపే కదా!

9. గోమాతకెవరు నేర్పారు తన బిడ్డను ఒళ్లంతా నాకి ముద్దుచేయమని?
మాటలకందని మాతృత్వం పొంగిపొర్లుతుండగా ఎవరు నేర్పాలి?

10. పొదిగినంత మాత్రానే కోడికి పిల్లల పట్ల మమకారమొచ్చెనుగా
ఆకాశం నుండి గ్రద్దొచ్చినా, శునకమొచ్చినా ఎదురొడ్డి
పోరాడడం మాతృత్వనైజమేగా

11. ఊరపిచ్చుకకెలా తెలుసునో మాతృత్వమంటే
గింజలేరి తెచ్చి గూటిలోనున్న పిల్లల నోట పెట్టెనుగా

12. కోకిల వంటి గాత్రం లేకున్నా కాకియైనను మరువదు
మాతృత్వప్రేమను
చెట్టుపైనున్న గూటిలో పిల్లలను రెక్కలొచ్చువరకు సాకుతున్నదిగా

13. బురదగుంటలో పొర్లాడే వరాహమైనను పిల్లలను మరువదుగా
ఈసడించే జనులు ఈర్ష్యపడేటట్లు మాతృప్రేమతో పెంచెనుగా

14. అడవిని వణికించే సింహమైనా తన కూనపట్ల లాలనయేగాని
క్రూరస్వభావము కానరాదు, అది మాతృత్వ ప్రేమకు
పరాకాష్టకదా!

15. పిల్లి తన కూనలను పదునైన దంతాలతో పదిలంగా పట్టుకుని
ఇల్లిల్లూ మారుతూ ఇంపైన స్థలంలో మాతృప్రేమతో
జారవిడుచునుగా

16. కోటి పాపాలు చేసిన కొడుకునైనా కోమలమైన మనస్సుతో
క్షమించే గుణం తల్లికిగాక మరెవరికున్నది ఈ లోకంలో?

17. గర్భంలో పిండమైననాడే తల్లిప్రేమను పెంచుకున్నది
గర్భంలో ప్రతి కదలికా కడుపుకు భారమైనా మనస్సుకు
పులకింతేకదా!

18. శారీరకంగా అబలయైనా తన బిడ్డ రక్షణకు సబలగా మారెనుగా
ప్రమాదానికి ఎదురొడ్డి నిలిచిన తెగువ తల్లిదికాక మరెవరిది
ఈ జగతిలో

19. ఆకలి తెలియని బిడ్డను అక్కున చేర్చుకుని ఆకలి తీర్చునది
లోకం తెలియని బిడ్డకు దిక్సూచిలా దారి చూపునది అమ్మయేగా

20. పిల్లలు రూపవంతులైనా, కురూపులైనా, సకలాంగులైనా,
దివ్యాంగులైనా
సమదృష్టితో చూసే మనసు తల్లికి కాక మరెవరికున్నది ఈ సృష్టిలో

21. బిడ్డలు అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైనా, సంపన్నులైనా,
బికారులైనా
ఏకదృష్టితో చూసే మనసు తల్లిదేకదా! వేరు భావన
లేనేలేదు కదా!

22. బిడ్డడు సుగుణాభిరాముడైనా, దుర్వ్యసనలోలుడైనా
తల్లి హృదయంలో తన స్థానము పదిలమేగా

23. సప్తవర్ణాలు మిళితమైన సూర్యకాంతిలా
సద్గుణాలన్నీ రాశీభూతమైనవి అమ్మ మనస్సుగా

24. తెలతెల్లవారకముందే బయలుదేరిన బిడ్డడైనా
అర్ధరాత్రి తూలివచ్చిన తనయుడైనా అమ్మ చూసేది బిడ్డ కడుపునే

25. నలుగుపెట్టి లాలిపోసి సాంబ్రాణి దూపంతో నిదురపుచ్చిన
తల్లి ఒడికి మించిన స్వర్గమెక్కడిది ఈ లోకంలో

26. జాబిలిని చూపించి గోరుముద్దలు తినిపించినావు
మారాంచేస్తున్న పిల్లాడికి మమతానురాగాలు పంచినావు

27. తనయుని ఆకలి దీర్చంగ నీ ఆకలిని మరిచినావు
ఆటపాటలు నేర్పించి అలసట నొందినావు

28. చిన్నారిని చిన్నికృష్ణుని వలె అలంకరించి ముచ్చటపడినావు
అల్లరిచేష్టలకు అతివలందరూ కలహానికొచ్చినా కసిరి పంపినావు

29. తనకిష్టమైనవన్ని కొసరికొసరి తినిపించగ తపనపడినావు
నీ ఇష్టాయిష్టాలేనాడో మరిచినావు, గుర్తింపులేని
త్యాగమూర్తియైనావు

30. కాన్వెంటు చదువులతో కాలంతో పరుగిడినావు
సూర్యుడు నడినెత్తికొచ్చినా అల్పాహారమే తిన మరచినావు

31. సముద్రకెరటాలలా అమ్మ ప్రేమ తరంగాలకు విరామం లేదుగా
ఒడ్డునున్న పాదాలను తడిపే కెరటంలా ప్రేమతరంగాలు
చల్లబరచునుగా

32. నిన్ను అనురాగంతో పెంచినా, ప్రారబ్ధాన్ననుభవించే
యోగాన్నిచ్చినది తల్లియేగా
ఓనమాలు నేర్పించి, దేహయాత్రకు సరిపడే దారుఢ్యాన్నిచ్చినది
అమ్మయేగా

33. హిమనీనదంలా చల్లదనాన్ని, ఉదయించే సూర్యునిలా
నులివెచ్చదనాన్ని
పట్టుతేనెలా తీయదనాన్ని అందించినది అమ్మయే కదా!

34. కాశీఅన్నపూర్ణలా ఆకలి తీర్చినావు. గంగమ్మ తల్లిలా దప్పిక తీర్చినావు
శక్తిస్వరూపిణిలా మనోనిబ్బరాన్నిచ్చినావు.
నీకు సాటిరాగల వారెవ్వరు ఈయవనిలో

35. తల్లికిచ్చిన మాట జవదాటలేక చిన్నస్వామి బాగోగులు
విచారించినారు
రమణులు తల్లి అళగమ్మకు మనోలయము చేసి ముక్తినిచ్చినారు

36. ఆదిశంకరుడు సన్యసించినగూడ తల్లికి తలకొరివి పెట్టి
మాట ఇచ్చిన తల్లి ఋణం తీర్చి ఆమె విలువ తెలియజెప్పినాడు

37. కడుపులో ఉండగానే బిడ్డ కడుపు నింపి కంటికి రెప్పలా
కాపాడినావు
వృద్ధాప్యంలో నిస్సత్తువైన నీకు పట్టెడన్నం పెట్టగ చేతులురాని
కఠినాత్ములెందరో

38. తన బిడ్డ తినకుండా తాను తిన్న తల్లిలేదు ఈ లోకంలో
మధురపదార్థమేదైనా దాచిదాచి తన బిడ్డ నోట బెట్టునుగా...

39. పడిలేచే పిల్లాడికి చేయిపట్టి నడక నేర్పినావు ఈ జీవనబాటలో
వేలమైళ్లు నడిచింది నీవు నేర్పిన తొలి అడుగుతోనే కదమ్మా

40. బిడ్డకు జన్మనిచ్చి సృష్టికర్తయైనావు, కడుపు నిండ తిండిపెట్టి
స్థితికారకురాలైనావు, జోలపాడి నిద్రపుచ్చి అలసటబాపినావు

41. ఆడపిల్లగా తల్లిచాటు బిడ్డగా బేలచూపులతో అపురూపంగా
పెరిగినావు
తల్లివైనంతనే పరిపూర్ణత్వమొందినావు, ఎంతో పరిణతి
సాధించినావు

42. పుట్టినింట గారాలుపోయి మారాంచేసి చిలిపి అల్లరి చేసినావు
అత్తింటివారు నిరాదరించినా నీ బిడ్డకు ఆదరణలో
లోటుచూపలేదు

43. కనిపెంచిన అమ్మ కొంగుపట్టుకు తిరిగి సందడిచేసినావు,
బ్రతుకు పూలబాటగా భావించినావు
అత్తింట్లో ఈసడింపు చూపులకు, పెదవి విరుపు మాటలకు
కలతచెందినా, బిడ్డల కల చెదరనివ్వలేదు

44. కట్నకానుకలకై వియ్యాలవారు కయ్యానికొచ్చినా
అమ్మ మనసు గాయపడినా, నీపై ప్రేమేగాని ద్వేషం లేదు

45. అత్తగారి ఆరళ్లకు, ఆడపడుచు వేధింపులకు ఓర్చినావు
అమ్మకు చెప్పక, బిడ్డకు తెల్పక మదనపడినావు

46. వేదభూమిలో పుట్టినా, వేధింపులను చవిచూసి ఆవేదన పడినావు
బిడ్డల మనసు గాయపడకుండా కొంగుచాటున దాచి
కుదుటపరచినావు

47. కష్టాలకడలిలో కన్నీటిపర్యంతమైనా కొంగుతో తుడిచివేసినావు
వెనుకకి మరలిన కెరటంలా ఉబికివచ్చిన కన్నీటిని
రెప్పలమాటున దాచినావు

48. పెరిగిన జీవనవ్యయంతో ఉద్యోగ, వ్యాపార బాధ్యతలు చేపట్టినావు
పిల్లల భవితే పరమావధిగా కుటుంబ పోషణకు ముందడుగు వేసినావు

49. మమకారాన్ని రంగరించి ఉగ్గుపాలను బోసినోటిలో పోసినావు
శ్రావ్యమైన కంఠంతో ఆత్మీయతానురాగాలు పంచినావు

50. బిడ్డ తొలి ఏడుపుకు తొణికిసలాడే ఆనందం నీ కళ్లలో
చూసినాము
ఇంకేనాడైనా బిడ్డ ఏడుపు నీ చెవులబడిన తల్లడిల్లినావు

51. సభలో అష్టావధాని అవధాన ప్రక్రియకు ఈర్ష్యపడినాము
ఇల్లాలిగా, తల్లిగా నీ క్రియలన్నీ అష్టావధానం కంటే మిన్నయే కదా!



అహంకారానికే ఇతరులు ఉన్నారు.
చైతన్యానికి ఇతరులు లేరు.

– సద్గురు శ్రీ నాన్నగారు








## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక







## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక



గురు రూపమైనట్టి కరుణాసముద్రమా
కృపజేసి మమ్మేలు మరుణాచలా











## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక







## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక













## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక











## సద్గురు శ్రీ నాన్నగారి
## చిరుదరహాసమాలిక











ఆత్మ బంధువులతో
ఆత్మీయక్షణాలు





## ఆత్మ బంధువులతో ఆత్మీయక్షణాలు











## ఆత్మ బంధువులతో ఆత్మీయక్షణాలు







## ఆత్మ బంధువులతో
## ఆత్మీయక్షణాలు







# భగవాన్ రమణుని కరుణాపూరిత వీక్షణాలు












## శ్రీ రమణాశ్రమం - అరుణాచలం



